News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 03 | సంచిక :85 | ఖమ్మం | సోమవారం, మే 12, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



## మన సైనిక సత్తా చాటాం

- సరిహద్దుల్లోనే కాదు.. రావల్పిండి వరకు వినిపించాం
- సిందూరం తుడిచేసిన వారిని శిక్షించాం
- ఆపరేషన్ సిందూర్‌పై రాజ్‌నాథ్
- అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించాం: వాయుసేన
- పాక్ అత్యాధునిక యుద్ధ విమానాలను నేలకూల్చాం
- కీలక యుద్ధ స్థావరాలను పేల్చేశాం
- రక్షణ శాఖ ప్రకటన
- కశ్మీర్‌పై పరిష్కారానికి పాటుపడతా: ట్రంప్
- సరిహద్దుల్లో ప్రశాంతత.. నేడు డీజీఎంవోల చర్చలు

ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం తన పరాక్రమాన్ని ప్రదర్శించిందని, పాక్ సైనిక ప్రధాన కార్యాలయం ఉన్న రావల్పిండిలోనూ గర్జించిందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి ద్వారా అనేక కుటుంబాల సిందూరాన్ని తుడిచేసినవారిని సైన్యం తగిన రీతిలో శిక్షించిందని చెప్పారు. ఇది కేవలం సైనిక చర్యే కాదని, ఉగ్రవాదంపై పోరులో భారత రాజకీయ, సామాజిక, వ్యూహాత్మక సంకల్పానికి నిదర్శనమని చెప్పారు. ఉగ్రవాదులతోపాటు భారత వ్యతిరేక శక్తులపై మన సైన్యం ప్రతీకారం

వివరాలు 2లో..

### ఇంజినీరింగ్‌లో 73.26% .. అగ్రికల్చర్‌లో 87.82%

# ఉత్తీర్ణత నమోదు

- ఎప్‌సెట్ ఫలితాలు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఇంజినీరింగ్‌లో తొలి పది ర్యాంకులు అబ్బాయిలకే... అగ్రికల్చర్‌లోనూ 9 కైవసం
- ఉత్తీర్ణతలో అమ్మాయిలే మెరుగు

తెలంగాణ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈఏపీసెట్- ఎప్‌సెట్) ఇంజినీరింగ్ విభాగంలో 73.26%... అగ్రికల్చర్-ఫార్మా విభాగంలో 87.82% మంది ఉత్తీర్ణులయ్యారు. రెండు విభాగాల్లో అబ్బాయిలే టాప్ ర్యాంకు సాధించారు. ఇంజినీరింగ్‌లో తొలి పది ర్యాంకులు, అగ్రికల్చర్ విభాగంలో మొదటి పదిలో తొమ్మిది ర్యాంకులను అబ్బాయిలే కైవసం చేసుకున్నారు. ఇంజినీరింగ్‌లో అబ్బాయిలు 72.79%, అమ్మాయిలు 73.88% మంది ఉత్తీర్ణులు కాగా... అగ్రికల్చర్‌లో అబ్బాయిలు 86.29%, అమ్మాయిలు 88.32% మంది ఉత్తీర్ణులయ్యారు. రెండింటిలోనూ అమ్మాయిల అర్హత శాతం అధికంగా ఉండటం విశేషం. ఎప్‌సెట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగాల ర్యాంకులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం తన నివాసంలో విడుదల చేశారు. ఉత్తీర్ణులైన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి టి.కిషన్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఎప్‌సెట్ కన్వీనర్ బి.డీన్‌కుమార్, కోకన్వీనర్ కె.విజయకుమార్‌రెడ్డి, జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.




### వరుసగా రెండేళ్లు ఉత్తరాంధ్ర విద్యార్థులదే తొలి ర్యాంకు

ఇంజినీరింగ్‌లో ఏపీలోని పార్వతీపురం జిల్లా కొమరాడకు చెందిన పల్లా భరత్‌చంద్ర 160 మార్కులకు 150.058 సాధించి ప్రథమ ర్యాంకు పొందాడు. ఈ విద్యార్థి ఇంటర్మీడియట్‌ను హైదరాబాద్‌లోనే చదివాడు. ఈ విభాగంలో 138.25 మార్కులకు పదో ర్యాంకు దక్కింది. గత ఏడాది ఎప్‌సెట్‌లో కూడా శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన సతివాడ జ్యోతిరాదిత్య 160కి 155.63 మార్కులు సాధించి ప్రథమ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. వరుసగా రెండేళ్లపాటు ఇంజినీరింగ్‌లో ఉత్తరాంధ్ర విద్యార్థులే తొలి ర్యాంకు సాధించడం విశేషం. అగ్రికల్చర్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన సాకేత్‌రెడ్డి 141.68 మార్కులు సాధించి తొలి ర్యాంకు సొంతం చేసుకున్నాడు. ఈ విభాగంలో 136.49 మార్కులకు పదో ర్యాంకు దక్కింది. రెండు విభాగాల్లో టాప్ 10 ర్యాంకర్లలో ఒక్కరే అమ్మాయి ఉన్నారు. అగ్రికల్చర్ విభాగంలో మాదాపూర్‌లో చదివిన రెండ్ల బ్రాహ్మణి 138.71 మార్కులు సాధించి ఐదో ర్యాంకు సాధించింది.

### ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత ఏటేటా కిందికి...

ఇంజినీరింగ్‌లో గతేడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం స్వల్పంగా తగ్గింది. ఈ ఏడాది గణితం ప్రశ్నలను కఠినంగా ఇచ్చారని విద్యార్థులు తెలిపారు. 2022తో పోలిస్తే ఈసారి 7 శాతానికిపైగా ఉత్తీర్ణత తగ్గడం విశేషం. ఎప్‌సెట్‌లో 160 ప్రశ్నలకు

వివరాలు 2లో..

### పాక్ ఆర్మీ 40 మంది సైనికులను

## కోల్పోయి ఉంటుంది



- ఎల్ఓసీలో భారత కాల్పులు... 35-40 మంది పాక్ సైనికులు మృతి
- ఐదుగురు భారత జవాన్ల వీరమరణం... అధికారుల నివాళి
- వారి త్యాగాలను దేశం ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుందని వెల్లడి

వివరాలు 2లో..

### ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

## 10 మంది మృతి




ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాయ్‌పుర్ - బలోద బజార్ మార్గంలో ప్రమాదం చోటు చేసుకుంది. ఇందులో 10 మంది మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడినట్లు రాయ్‌పుర్ ఎస్పీ లాల్ ఉమ్మెద్ సింగ్ వెల్లడించారు. జనాలతో నిండి ఉన్న ప్యాసింజర్ వాహనాన్ని ట్రక్కు ఢీ కొట్టింది. చౌతియా ఛత్తిలో ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా వాహనం ప్రమాదానికి గురైనట్లు ఎస్పీ తెలిపారు. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

వివరాలు 2లో..

### రేవంత్ రెడ్డి ఒక సైకో, శాడిస్ట్

## అంటూ ఈటల ఫైర్...

### ఘాటుగా కౌంటర్ ఇచ్చిన జగ్గారెడ్డి



- ఈటలపై జగ్గారెడ్డి ఫైర్: బట్టలిప్పి గుంజీలు తీయిస్తా అంటూ వార్నింగ్
- రేవంత్‌ను విమర్శిస్తే ఊరుకోబోమని హెచ్చరిక
- ఈటలవి నల్లికుట్ల రాజకీయాలు అంటూ విమర్శలు

హైదరాబాద్ శివారు బాచుపల్లిలోని పూజిత అపార్ట్‌మెంట్‌కు హైకోర్టు ఆదేశాల మేరకు అధికారులు కూల్చివేత నోటీసులు జారీ చేసిన ఘటన తీవ్ర రాజకీయ దుమారానికి దారి తీసింది. ఈ విషయం తెలుసుకున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ నిన్న హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక పెద్ద శాడిస్ట్, సైకో. ప్రజలను ఇబ్బందులకు గురిచేయడంలోనే ఆయన ఆనందం పొందుతున్నారు. రాష్ట్రంలో

వివరాలు 2లో..

## ఉపాధ్యాయుల బదిలీలకు సర్వం సిద్ధం

ఉపాధ్యాయ పోస్టుల హేతుబద్ధీకరణ, బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుంది. రాష్ట్రంలో బదిలీల చట్టం ప్రకారం మొదటిసారి ఈ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ కొంతమంది అంధ ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించగా, స్టేటస్‌కో విధించింది. దీంతో ఆ పోస్టులను మినహాయించి, బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని విద్యాశాఖ భావిస్తోంది. ఐచ్ఛికాలు పెట్టుకునేందుకు మాత్రం

వివరాలు 2లో..



## మే 15 నుంచి వాట్సాప్‌లో రేషన్ కార్డు దరఖాస్తు

- రైస్ కార్డ్: సులభతర సేవలు ప్రారంభం
- 72,519 మంది రైస్ కార్డ్ సేవలు వినియోగించుకున్నారని మంత్రి నాదెండ్ల వెల్లడి
- జూన్‌లో స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ

రాష్ట్రంలో పౌర సరఫరాల సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. నూతన రైస్ కార్డుల జారీతో పాటు ఇతర ఆరు రకాల

వివరాలు 2లో..



### ఈటల మర్యాదస్తుడు అనుకున్నాం...

## కానీ మతి తప్పినట్టుంది

- సీఎం రేవంత్‌పై ఈటల వ్యాఖ్యల పట్ల ఆది శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం
- ఈటల మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని విమర్శ
- బీజేపీ అధ్యక్ష పదవి కోసం సీఎంను దూషిస్తున్నారని ఆరోపణ
- అనుచిత భాష వాడితే సహించేది లేదని హెచ్చరిక



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ఈటలను తాను ఒక మర్యాదస్తుడిగా భావించేవాడినని, కానీ ఆయన ఇటీవలి మాటలు చూస్తుంటే, మతి తప్పినట్లుగా ఉందని

వివరాలు 2లో..

## కాల్పుల విరమణను మొదట ట్రంప్ ప్రకటించారు... దీనిపై చర్చించాలి

### ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ లేఖ

- భారత్-పాక్ కాల్పుల విరమణ
- పార్లమెంటు సమావేశానికి రాహుల్ గాంధీ, ఖర్గే డిమాండ్
- ప్రధాని మోదీకి వేర్వేరుగా లేఖలు రాసిన రాహుల్, ఖర్గే

వివరాలు 2లో..



## మన పోరాటాలు భవిష్యత్ తరాలను నిర్ణయిస్తాయి

రేపటి తరాల భవిష్యత్తు మన పోరాటాలపైనే ఆధారపడి ఉందని అన్నారు వివేక్. ఎంతో కులవివక్ష ఉన్నప్పటికీ డా.అంబేడ్కర్ 23 డిగ్రీలు సాధించారని చెప్పారు. అంబేడ్కర్ పోరాటాల ఫలితంగానే మనం ఇప్పుడు ఇలా ఉన్నామని..

వివరాలు 2లో..



## బ్రహ్మోస్ సత్తా ఏంటో పాకిస్థాన్‌ను అడగండి

### యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు



- బ్రహ్మోస్ క్షిపణి శక్తి ఏంటో పాకిస్థాన్‌ను అడిగి తెలుసుకోమన్న యూపీ సీఎం యోగి
- 'ఆపరేషన్ సిందూర్' విజయం బ్రహ్మోస్ సత్తాను ప్రపంచానికి చూపిందని ప్రశంస
- లక్నోలో రూ.300 కోట్లతో నిర్మించిన బ్రహ్మోస్ క్షిపణి ఉత్పత్తి యూనిట్ ప్రారంభం
- ఉగ్రవాదానికి దాని భాషలోనే సమాధానం చెప్పాలని వ్యాఖ్య
- ప్రధాని మోదీ నాయకత్వంలో ఉగ్రవాదంపై పోరాటానికి ఏకతాటిపై నిలవాలని పిలుపు

వివరాలు 2లో..

# మే 15 నుంచి వాట్సాప్‌లో రేషన్ కార్డు దరఖాస్తు

- మొదటి పేజి తరువాయి
అనుబంధ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఈ సేవలను ఇప్పటికే 72,519 మంది వినియోగించుకున్నారని, మే 15వ తేదీ నుంచి వాట్సాప్ గవర్నెన్స్ విధానం ద్వారా కూడా ఇంటి వద్ద నుంచే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.
గుంటూరు జిల్లా తెనాలిలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ వివరాలను వెల్లడించారు. ఈ నెల 8వ తేదీ నుంచి నూతన రైస్ కార్డుల జారీ, కార్డుల విభజన, చిరునామా మార్పు, కుటుంబ సభ్యుల చేర్పులు, తొలగింపులు, కార్డుల సరెండర్ వంటి ఆరు రకాల సేవలు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందుబాటులోకి వచ్చాయని ఆయన వివరించారు. త్వరలో, అంటే మే 15 నుంచి, 95523 00009 నంబర్‌కు వాట్సాప్ లో Hello' అని సందేశం పంపడం ద్వారా కూడా ఈ సేవలను పొందవచ్చని మంత్రి తెలిపారు. అంతేకాకుండా, జూన్ మాసంలో అర్హులైన వారందరికీ ఉచితంగా స్మార్ట్ కార్డుల రూపంలో నూతన రైస్ కార్డులను అందజేయనున్నట్లు ప్రకటించారు.
నూతన రైస్ కార్డుల జారీ ప్రక్రియలో జాప్యం గురించి వివరిస్తూ, "2024 ఎన్నికల నేపథ్యంలో గత ఏడాది మార్చిలో భారత ఎన్నికల సంఘం నూతన కార్డుల జారీని నిలిపివేయాలని ఆదేశించింది. ఆ తర్వాత, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు Ekyc నమోదు తప్పనిసరి చేయడంతో నూతన కార్డుల జారీకి కొంత ఆటంకం ఏర్పడింది. అయితే, ఇప్పటివరకు 95 శాతం Ekyc ప్రక్రియ పూర్తయినందున, ఇప్పుడు నూతన రైస్ కార్డుల జారీకి మార్గం సుగమమైంది" అని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,46,21,223 రైస్ కార్డులు ఉన్నాయని, వీటి ద్వారా సుమారు 4,24,59,028 మంది లబ్ధి పొందుతున్నారని మంత్రి తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లలు, 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు Ekyc నుంచి మినహాయింపు ఇవ్వడంతో దాదాపు 6,45,765 మందికి ఈ ప్రక్రియ అవసరం లేకపోయిందని అన్నారు.
సంస్కరణల్లో భాగంగా, Ekyc పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా స్మార్ట్ రేషన్ కార్డును అందజేస్తామని, ఈ కార్డులో కుటుంబ సభ్యులందరి వివరాలు పొందుపరచబడతాయని మంత్రి వివరించారు. ఒంటరిగా నివసిస్తున్న వారు, 50 ఏళ్లు పైబడి వివాహం కానివారు, భార్యాభర్తల నుంచి విడిపోయినవారు, అనాథాశ్రమాల్లో నివసించే వృద్ధులు కూడా నూతన రైస్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. మొట్టమొదటిసారిగా లింగమార్పిడి చేసుకున్న వారికి కూడా ఈ రైస్ కార్డు సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. దీంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో పింఛను పొందుతున్న కళాకారులకు, కొండ ప్రాంతాల్లో నివసించే చెంచులు, యానాదులు వంటి 12 ఆదిమ గిరిజన తెగలకు (పీవీటీజీ) చెందిన వారికి ప్రత్యేకంగా ఏఏవై (అంత్యోదయ అన్న యోజన) కార్డులను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్డుల ద్వారా వారికి నెలకు 35 కిలోల బియ్యం అందజేయడం జరుగుతుందని మంత్రి నాదెండ్ల మనోహర్ వివరించారు.

# ఇంజినీరింగ్‌లో 73.26% .. అగ్రికల్చర్‌లో 87.82% ఉత్తీర్ణత నమోదు

- మొదటి పేజి తరువాయి
180 నిమిషాల్లో సమాధానం ఇవ్వాలి. 40 మార్కులు వస్తే ఉత్తీర్ణులవుతారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కనీస మార్కుల నిబంధన వర్తించదు. మొత్తం 55,411 మంది అర్హత సాధించలేదు.
అగ్రికల్చర్-ఫార్మా విభాగంలో ఈసారి ఉత్తీర్ణత దాదాపు 2 శాతం తగ్గింది ఈ విభాగంలో 9,889 మంది కనీస మార్కులు సాధించకపోవడంతో అర్హత పొందలేదు.

**ఎప్‌సెట్‌లో గురుకుల విద్యార్థుల సత్తా**
సంక్షేమ గురుకుల సొసైటీ విద్యార్థులు ఎప్‌సెట్ ఫలితాల్లో సత్తా చాటారు. గిరిజన గురుకులాల విద్యార్థులు దాదాపు 170 మందికి వారి ర్యాంకుల ఆధారంగా జేఎన్‌టీయూ, ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీతో పాటు ఇతర ప్రతిష్ఠాత్మక ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్లు లభిస్తాయని సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మి తెలిపారు. ఇద్దరు విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకులు పొందారని చెప్పారు.
బీసీ గురుకుల విద్యార్థులు ఇంజినీరింగ్ విభాగంలో 66 మంది, వ్యవసాయ-ఫార్మసీ విభాగంలో 35 మంది ప్రతిభ చూపించారని ఆ సొసైటీ కార్యదర్శి సైదులు పేర్కొన్నారు.

# మన సైనిక సత్తా చాటాం

- మొదటి పేజి తరువాయి
తీర్చుకుందన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో సూపర్‌సోనిక్ బ్రహ్మోస్ ఉత్పత్తి, పరీక్షా కేంద్రాన్ని ఆదివారం ఆయన దిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించి ప్రసంగించారు. మరోవైపు సైనికాధికారులు, వైమానిక దళాధికారులు విలేకరులతో మాట్లాడుతూ- పోరులో పాక్‌ను చావుదెబ్బ కొట్టామని, భారీనష్టం కలిగించామని ప్రకటించారు. సరిహద్దుల్లో శాంతి నెలకొనడం ఆదివారం పెద్ద ఊరట.
పాక్ స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నాం
"ఉగ్రశక్తులకు భారత్ దీటుగా బదులిస్తుంది. ఉగ్రవాదంపై పోరులో మనకున్న దృఢ సంకల్పంతోపాటు మన సైనిక శక్తిసామర్థ్యాలను ఈ ఆపరేషన్ చాటిచెప్పింది. పహల్గాం బాధితులకు న్యాయం చేకూరింది. పాక్ ప్రజలపై భారత్ దాడి చేయలేదు. అక్కడి ఉగ్ర స్థావరాలను నాశనం చేయడమే ధ్యేయంగా ఆపరేషన్‌ను చేపట్టాం. దాయాది మాత్రం భారత పౌరులే లక్ష్యంగా మన దేశంపై దాడులు చేసింది. పౌర ప్రాంతాలు, ఆలయాలు సహా మతపరమైన ప్రదేశాలపైనా దాడులకు ప్రయత్నించింది. మన సైన్యం శౌర్య పరాక్రమాలను ప్రదర్శించడమే కాకుండా సంయమనాన్ని పాటించింది. భారత్‌లో ఉగ్రచర్యలకు పాల్పడితే పర్యవసానాలు ఎలా ఉంటాయనేది ప్రపంచమంతా చూసింది. ఇది సరికొత్త భారతదేశమని, ఉగ్రవాద వ్యతిరేక చర్యలకు దీటైన జవాబును సరిహద్దుకు రెండువైపులా ఇస్తామని ప్రధాని మోదీ స్పష్టంచేశారు" అని రాజ్‌నాథ్ చెప్పారు. ఉగ్రవాదంపై మనం చర్యలు తీసుకునేటప్పుడు ఉగ్రవాదులు, వారి పోషకులు దేశం అవతల ఉన్నా కూడా వారికి రక్షణ ఉండదని రుజువు చేశామని చెప్పారు. బ్రహ్మోస్ కేవలం ఆయుధం మాత్రమే కాదని.. అది సైనిక దళాల బలాన్ని, దేశ సరిహద్దుల్ని కాపాడుకునే సంకల్పాన్ని చాటే సందేశమని చెప్పారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌లో బ్రహ్మోస్ క్షిపణులను భారత్ ఉపయోగించిందని వెల్లడించారు. ఈ క్షిపణులకున్న శక్తి ప్రపంచ దేశాలకు తెలిసిందన్నారు. దీని ప్రభావం గురించి తెలియని వారెవరైనాఉంటే.. పాకిస్థాన్‌ను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఉగ్రవాదం అనేది కుక్కతోక లాంటిదని.. దానిని సరిచేయాలంటే వారి సొంత భాషలోనే బదులివ్వాలని పేర్కొన్నారు.

**కశ్మీర్‌పై కలిసి పనిచేద్దాం: అమెరికా**
భారత్-పాకిస్థాన్ దేశాలతో కలిసి కశ్మీర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. సంఘర్షణతో మరణాలు, విధ్వంసం తప్ప ఏమీ ఉండదనేది రెండు దేశాల నాయకత్వాలు అర్థం చేసుకున్నందుకు గర్వంగా ఉందని 'ట్రూత్ సోషల్' మాధ్యమంలో ఆయన వ్యాఖ్యానించారు. 'ఘర్షణలు ఇంకా కొనసాగి ఉంటే లక్షలమంది అమాయక ప్రజలు చనిపోవచ్చు. కాల్పుల విరమణపై చరిత్రాత్మక నిర్ణయం తీసుకోవడానికి అమెరికా సాయం చేసినందుకు నాకు గర్వంగా ఉంది. మీ రెండు దేశాల నాయకత్వాలకు దైవం ఆశీస్సులు ఉంటాయి. మనం కేవలం చర్చలు జరపడమే కాదు.. రెండు దేశాలతో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకుందాం. ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న కశ్మీర్ విషయంలో పరిష్కారాన్ని అన్వేషించేందుకు మీతో కలిసి పనిచేస్తా' అంటూ పోస్ట్ చేశారు. ట్రంప్ తన తొలివిడత పాలనలో కూడా కశ్మీర్ విషయంలో జోక్యం చేసుకోవాలని అనుకున్నారు. అప్పటి భారత్, పాకిస్థాన్ ప్రధానుల వద్ద దానిగురించి ప్రస్తావించారు. తృతీయ పక్షం జోక్యాన్ని భారత్ తిరస్కరించింది. ఇప్పుడు మరోసారి ప్రతిపాదించారు. కశ్మీర్ వివాద పరిష్కారానికి చొరవ తీసుకుంటానని ట్రంప్ చెప్పడాన్ని పాక్ ఆహ్వానించింది.

**డోభాల్‌తో మాట్లాడిన చైనా విదేశాంగ మంత్రి**
విభేదాలన్నింటినీ భారత్-పాక్‌లు చర్చల ద్వారా పరిష్కరించుకుని, దీర్ఘకాలం పాటు కాల్పుల విరమణకు కట్టుబడి ఉంటాయని చైనా ఆకాంక్షించింది. రెండు దేశాల ప్రాథమిక ప్రయోజనాల పరిరక్షణకు, అంతర్జాతీయ సమాజ ఆకాంక్షలు నెరవేరడానికి ఇది అవసరమని పేర్కొంది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ ఆదివారం భారత జాతీయ భద్రతా సలహాదారుడు అజీత్ డోభాల్‌తో మాట్లాడారు. రెండుదేశాలూ సంయమనంతో వ్యవహరిస్తూ చర్చలు, సంప్రదింపుల ద్వారా విభేదాలను పరిష్కరించుకుంటాయని వాంగ్‌యీ ఆశాభావం వ్యక్తంచేశారు. భారత్, పాక్‌లు రెండూ తమకు సరిహద్దు దేశాలేనని గుర్తుచేశారు. పహల్గాం ఘటన సహా అన్ని రూపాల్లో ఉగ్రవాదాన్ని చైనా వ్యతిరేకిస్తుందన్నారు. యుద్ధం చేయడానికి తాము అనుకూలం కాదని, పహల్గాం దాడిలో వాటిల్లిన ప్రాణనష్టం తర్వాత ఉగ్రవాదులపై పోరాడాల్సి వచ్చిందని డోభాల్ ఈ సందర్భంగా చెప్పారు. పాక్ ప్రధాని షెహబాజ్‌తోనూ వాంగ్‌యీ మాట్లాడారు.
దిల్లీలో ఆదివారం అత్యున్నతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ. చిత్రంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్, త్రిదళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తదితరులు

**కాల్పుల విరమణ.. ఉద్రిక్తత తగ్గింపుపై భేటీ**
కాల్పుల విరమణ, అనంతర పరిస్థితిపై ఇరు దేశాల మధ్య సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు కీలక చర్చలు జరగనున్నాయి. హాట్‌లైన్‌లో జరగనున్న ఈ చర్చల్లో రెండు దేశాల 'సైనిక కార్యకలాపాల డైరెక్టర్ జనరల్' (డీజీఎంవో)లు పాల్గొంటారు. కాల్పుల విరమణ కొనసాగింపు, ఉద్రిక్తత తగ్గించడం వంటి కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది.

**ప్రధాని ఉన్నతస్థాయి సమీక్ష**
శనివారం రాత్రి పాక్ కాల్పుల ఉల్లంఘనకు పాల్పడిన తర్వాత తొలిసారిగా ప్రధాని మోదీ తర్వాత ఆదివారం తన నివాసంలో అత్యున్నతస్థాయి సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జైశంకర్, త్రివిధ దళాధిపతులతో సమీక్ష జరిపారు. సరిహద్దుల్లో తాజా పరిస్థితిని జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజీత్ డోభాల్ వివరించారు.

# ఉపాధ్యాయుల బదిలీలకు సర్వం సిద్ధం

- మొదటి పేజి తరువాయి
వారికి అవకాశం కల్పిస్తారు. కోర్టు తీర్పునకు లోబడి ఆ తర్వాత అంధ ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించనుంది. విడాకులు తీసుకున్న వారికి బదిలీల్లో ప్రాధాన్య పాయింట్లు ఇవ్వలేదని మరికొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై ఇంతవరకు ఎలాంటి ఆదేశాలూ రాలేదు. మొత్తంగా బదిలీల ప్రక్రియ ఈ నెల 15 నుంచి చేపట్టాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. మొదట ప్రధానోపాధ్యాయులకు బదిలీలు చేస్తారు. దాంతో ఖాళీ అయిన స్థానాలు, కొత్తగా అవసరమయ్యే వాటిల్లో స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పిస్తారు. తర్వాత మిగతా ప్రక్రియ ఉంటుంది. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల అవసరాల మేరకు సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు కల్పిస్తారు. కాకపోతే స్కూల్ అసిస్టెంట్ పోస్టుల అవసరం చాలా తక్కువగా ఉన్నట్లు తెలిసింది. ఎస్జీటీలకు ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పిస్తారు. కొంతమంది సబ్జెక్టు టీచర్లకూ ఆదర్శ పాఠశాలల హెచ్ఎంలుగా అవకాశం ఇస్తారు.

**సిద్ధమైన సీనియారిటీ జాబితా**
ఉమ్మడి జిల్లాల వారీగా ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను విద్యాశాఖ సిద్ధం చేసింది. గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన జీఓ-117కు ప్రత్యామ్నాయంగా ఇప్పటికే పోస్టుల హేతుబద్ధీకరణ ప్రక్రియ పూర్తిచేశారు. బదిలీలను ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తారు. మే 31 నాటికి 8 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులు, అయిదేళ్ల సర్వీసు పూర్తయిన హెచ్ఎంలకు తప్పనిసరిగా బదిలీ ఉంటుంది. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ సర్వీసు పూర్తయి.. ఐచ్ఛికాలు ఇవ్వకపోతే.. ప్రక్రియ పూర్తయిన తర్వాత మిగిలిన స్థానాలకు బదిలీ చేస్తారు. అవసరమైతే చర్యలు కూడా తీసుకుంటారు. ఆదర్శ పాఠశాలలకు ఈ చట్టం వర్తించదు. పాఠశాలల కేటగిరీల వారీగా పాయింట్లు ఇస్తారు. ఏడాదికి కేటగిరీ-1కు ఒకటి, కేటగిరీ-2కు రెండు, కేటగిరీ-3కు మూడు, కేటగిరీ-4లో ఉన్న వారికి అయిదు పాయింట్లు ఇస్తారు. హెచ్ఆర్ఏ, రోడ్డు రవాణా కారణంగా ఈ కేటగిరీల్లో మార్పులుంటే పాయింట్లలోనూ మార్పు చేస్తారు. ఏడాదికి ఒక 0.5 చొప్పున సర్వీసుకు పాయింట్లు ఇస్తారు. మే 31 నాటికి ఏడాదిగా పరిగణిస్తారు. స్పౌజ్, 40 ఏళ్లు దాటిన అవివాహిత, దివ్యాంగులు, గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర, జిల్లా, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, వితంతువు, క్యాన్సర్ తదితర వ్యాధులతో బాధపడేవారికి, ఉద్యోగిపై ఆధారపడి ఉన్నవారికి ప్రత్యేక పాయింట్లు ఇస్తారు. హేతుబద్ధీరణలో పోస్టు కోల్పోయే టీచర్లు రేషనలైజేషన్ పాయింట్లు లేదా పాత స్టేషన్ పాయింట్లలో ఏదో ఒక దాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. మే 31 నాటికి రెండేళ్ల సర్వీసు మాత్రమే ఉండే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు బదిలీల నుంచి మినహాయింపు ఉంటుంది. కావాలనుకుంటే వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. బదిలీలపై గ్రీవెన్స్ తర్వాతే కోర్టుకు వెళ్లాలి. గ్రీవెన్స్‌కు వివిధ స్థాయిల్లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.
ఇద్దరు ఉపాధ్యాయులకు ఒకే పాయింట్లు ఉంటే సీనియారిటీని ప్రామాణికంగా తీసుకుంటారు. ఆ తర్వాత వయసును పరిశీలిస్తారు. ఏవరైనా అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే నెలకు ఒకటి చొప్పున గరిష్ఠంగా 10 మైనస్ పాయింట్లు ఉంటాయి.

**ఖాళీల నోటిఫికేషన్ ఇలా..**
మే 31 నాటికి పదవీ విరమణ చేసిన పోస్టులతో సహా ఖాళీలను భర్తీకి తీసుకుంటారు.
తప్పనిసరిగా బదిలీ అయ్యే స్థానాలు.
రేషనలైజేషన్‌తో వచ్చే ఖాళీలు.
ఏడాది అంతకుమించి అనధికారికంగా గైర్హాజరు అయిన టీచర్ల స్థానాలు.
ఉన్నత చదువుల కోసం టీచర్లు సెలవులు తీసుకుంటే వాటిని ఖాళీగా చూపుతారు.
బదిలీల కౌన్సెలింగ్ వల్ల వచ్చే వాటిని ఖాళీగా చూపుతారు.
ఆయా జిల్లాల్లోని మొత్తం ఖాళీలను అవసరాల మేరకు మండలాలకు సర్దుబాటు చేస్తారు. ఉదాహరణకు ఒక జిల్లాలో 5 వేల పోస్టులు ఉండి.. 4,500 మంది పనిచేస్తుంటే బదిలీల్లో 4,500, దీనికి అదనంగా డీఎస్సీ పోస్టులు కలిపి చూపుతారు.

## మన పోరాటాలు భవిష్యత్ తరాలను నిర్ణయిస్తాయి

- మొదటి పేజి తరువాయి
మన పోరాటాలు మన భవిష్యత్ తరాలను నిర్ణయిస్తాయని చెప్పారు ఎమ్మెల్యే వివేక్. 'తిరుపతి మాలల ఆత్మీయ సభ'లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన.. కీలక వ్యాఖ్యలు చేశారు. మాల జాతి తక్కువగా ఉంది.. ఏం చేసినా కొట్లాడరనే భావన ప్రభుత్వాలలో ఉందని, అందుకే మాలల విషయంలో ప్రభుత్వాలు, నాయకులు అన్యాయం చేస్తున్నారని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. 'తిరుపతి మాలల ఆత్మీయ సభ'లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన.. కీలక వ్యాఖ్యలు చేశారు. ఏం చేసినా మాలలు పట్టించుకోరు అనే భావన ప్రభుత్వాలలో ఉందని.. మనం కొట్లాడినప్పుడే అది పోతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేక్ అన్నారు. ఈ ఆలోచన మాలల్లో రాకుంటే రాబోయే కాలంలో మాలలను అణచి వేస్తారని హెచ్చరించారు. కొట్లాడకుంటే పని జరగదని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడైతే డిస్క్రిమినేషన్ ఉందో అక్కడ అఫమేషన్ పాలసీ ఉందని.. ఎవరైతే అణచివేయబడతారో.. వారిని అన్ని విధాల పైకి తీసుకొచ్చి.. అందరికీ సమాన స్థాయిలో తీసుకురావాలనే పాలసీలు అమలు చేస్తున్నారని అన్నారు. కానీ ఇండియాలోనే అలాంటి పాలసీ లేదని అన్నారు. మాలలు కలిసికట్టుగా పోరాడినప్పుడే భవిష్యత్తు.. రాబోయే తరాల పిల్లల భవిష్యత్తు బాగుంటుందని గుర్తు చేశారు.

## ఈటల మర్యాదస్తుడు అనుకున్నాం... కానీ మతి తప్పినట్టుంది

- మొదటి పేజి తరువాయి
ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, "బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కావాలనుకుంటే మీ పార్టీ అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకోవాలి తప్ప, మా ముఖ్యమంత్రిని అసభ్య పదజాలంతో దూషిస్తే పదవి వస్తుందనుకోవడం మీ అవివేకానికి నిదర్శనం. ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో మీరు ఈ స్థాయికి దిగజారతారని మేము ఊహించలేదు. దయచేసి మీ పిచ్చి వాగుడు, ప్రేలాపనలు ఆపండి" అని హితవు పలికారు. ముఖ్యమంత్రిని 'శాడిస్ట్, సైకో' వంటి పదాలతో దూషించడంపై స్పందిస్తూ, "మాకు కూడా అంతకుమించిన భాషలో సమాధానం చెప్పడం వచ్చు, అది గుర్తుంచుకోండి. ముప్పై ఏళ్ల రాజకీయ అనుభవం ఉండి 'నా కొడకా' వంటి పదాలు వాడుతున్నారంటే మీ మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. మీ నీచ రాజకీయ ప్రయోజనాల కోసం మా ముఖ్యమంత్రిపై దిగజారుడు భాష ఉపయోగిస్తే సహించే ప్రసక్తే లేదు" అని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు. ఈటల రాజేందర్ తన అనుచిత పదజాలాన్ని మానుకోకపోతే, తాము కూడా అంతకంటే తీవ్రమైన భాషను ఉపయోగించాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## బ్రహ్మోస్ సత్తా ఏంటో పాకిస్థాన్‌ను అడగండి

భారతదేశపు అమ్ములపొదిలోని బ్రహ్మోస్ క్షిపణి శక్తి సామర్థ్యాలు ఎలాంటివో పాకిస్థాన్‌ను అడిగితే తెలుస్తుందని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన 'ఆపరేషన్ సిందూర్' ద్వారా బ్రహ్మోస్ క్షిపణి తన ప్రతాపాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని ఆయన కొనియాడారు. లక్నోలోని ఉత్తర ప్రదేశ్ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి ఉత్పత్తి కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ, 'ఆపరేషన్ సిందూర్' విజయం సాధించినందుకు భారత సాయుధ దళాలు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఉత్తర ప్రదేశ్ ప్రజల తరఫున అభినందనలు తెలియజేస్తున్నాను" అని అన్నారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో మీరు బ్రహ్మోస్ క్షిపణి యొక్క ఒక గ్లింప్స్ చూసి ఉండవచ్చు. ఒకవేళ చూడకపోతే, బ్రహ్మోస్ క్షిపణి శక్తి గురించి పాకిస్థాన్ వాళ్లను అడగండి. ఇకపై ఎలాంటి ఉగ్రవాద చర్య జరిగినా దాన్ని యుద్ధ చర్యగా పరిగణిస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు" అంటూ యోగి గట్టిగా హెచ్చరించారు. ఉత్తరప్రదేశ్‌ను రక్షణ ఉత్పత్తుల హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ నూతన కేంద్రంలో ఏటా 80 నుంచి 100 బ్రహ్మోస్ క్షిపణులను ఉత్పత్తి చేయనున్నారు. ఇది దేశీయ రక్షణ మౌలిక సదుపాయాలకు కీలక చేర్పు అని ఆయన అభివర్ణించారు. ఉగ్రవాదంపై భారత్ వైఖరిని పునరుద్ఘాటిస్తూ, "ఉగ్రవాద సమస్యను పూర్తిగా అణిచివేసే వరకు దానికి పరిష్కారం లభించదు. ఇందుకోసం ప్రధాని మోదీ నాయకత్వంలో మనమందరం ఏకతాటిపై నిలబడి పోరాడాలి. ఉగ్రవాదం ప్రేమ భాషను ఎప్పటికీ అర్థం చేసుకోలేదు. దానికి దాని భాషలోనే సమాధానం చెప్పాలి. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా భారత్ యావత్ ప్రపంచానికి ఒక సందేశాన్ని ఇచ్చింది" అని యోగి స్పష్టం చేశారు. భారత డీఆర్‌డీఓ, రష్యాకు చెందిన ఎన్‌పీఓ మషినోస్ట్రోయేనియా సంయుక్తంగా అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ క్షిపణి 290 నుంచి 400 కిలోమీటర్ల పరిధిని కలిగి ఉండి, మాక్ 2.8 వేగాన్ని అందుకోగలదు. దీన్ని భూమి, సముద్రం, గగనతలం నుంచి ప్రయోగించవచ్చు. కాగా, లక్నో యూనిట్‌లో ఏరోస్పేస్ ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ సెంటర్ కూడా ఉంది. ఇక్కడ ఏటా 100 నుంచి 150 నెక్స్ట్ జనరేషన్ బ్రహ్మోస్ క్షిపణులు తయారు కానున్నాయి. ఇవి ప్రస్తుత క్షిపణుల కంటే తేలికగా ఉండి, మరింత ఎక్కువ దూరం లక్ష్యాలను ఛేదించగలవు.

## పాక్ ఆర్మీ 40 మంది సైనికులను కోల్పోయి ఉంటుంది

నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వెంబడి మే 7 నుంచి మే 10 మధ్య జరిగిన ఫిరంగి దాడులు, చిన్న ఆయుధాలతో కాల్పుల్లో పాకిస్థాన్ సైన్యానికి చెందిన సుమారు 35 నుంచి 40 మంది సైనికులు మరణించినట్లు భారత సైనిక వర్గాలు ఆదివారం ఒక మీడియా సమావేశంలో వెల్లడించాయి. ఇదే సమయంలో, 'ఆపరేషన్ సిందూర్' పేరిట చేపట్టిన ప్రత్యేక కార్యకలాపంలో వందమందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు భారత సైన్యం ప్రకటించింది.'ఆపరేషన్ సిందూర్' మరియు దాని ప్రభావంపై ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఎయిర్ మార్షల్ ఏకే భారతి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్, మేజర్ జనరల్ ఎస్ఎస్ శర్మ, వైస్ అడ్మిరల్ ఏఎన్ ప్రమోద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పాకిస్థాన్ బహుశా ఊహించని విధంగా భారత్ వేగంగా, కచ్చితత్వంతో తిప్పికొట్టిందని తెలిపారు. ఈ కార్యకలాపాల సమయంలో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో భారత సైన్యానికి చెందిన ఐదుగురు సైనికులు వీరమరణం పొందారని అధికారులు తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో, వారి త్యాగాలను ఈ దేశం కృతజ్ఞతతో ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుంది మరియు గొప్పగా కీర్తిస్తుందని పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డి ఒక సైకో, శాడిస్ట్ అంటూ ఈటల ఫైర్...

- మొదటి పేజి తరువాయి
తుగ్లక్ ప్రభుత్వం నడుస్తోంది. ప్రజల జోలికి వస్తే ఖబడ్దార్," అంటూ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయి వాస్తవాలను సీఎం గమనించడం లేదని, తన చుట్టూ ఏం జరుగుతుందో కూడా ఆయనకు తెలియడం లేదని దుయ్యబట్టారు. "ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని వ్యవస్థను సరిదిద్దుకోవాలి. ప్రజల జీవితాలతో చెలగాటమాడేవారు ఎవరూ బాగుపడరు" అని హితవు పలికారు.

**ఈ ఈటల పాగల్ గాడు అయ్యిండు: జగ్గారెడ్డి**
సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మరోసారి ఇటువంటి 'లూజ్ కామెంట్స్' చేస్తే సహించేది లేదని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఈ ఈటల పాగల్ గాడు అయ్యిండు... అన్నీ బేవకూఫ్ చేష్టలు చేస్తున్నాడు అంటూ మండిపడ్డారు. ఆదివారం నాడు గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తన నల్లికుట్ల రాజకీయాలు మానుకోవాలి. హద్దులు మీరి నువ్వు మాట్లాడావు, అందుకే నేను కూడా హద్దులు దాటి సమాధానం చెప్పాల్సి వస్తోంది. అసలు, ఈటలను తిట్టడానికే ఈ ప్రెస్ మీట్ పెట్టాను" అని జగ్గారెడ్డి పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజల సమస్యల గురించి ఈటల ఏనాడూ మాట్లాడలేదని, కేవలం రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆయన ఆరోపించారు.

# ప్రతీ ఒక్కరూ ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నదే నా ఆకాంక్ష

- దేవుణ్ణి కూడా అదే కోరుకున్నా...!
- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- శంకరగిరి తండాలో శిఖర, ధ్వజ ప్రతిష్టా మహొత్సవానికి హాజరు



**సికే న్యూస్ ప్రతినిధి.నేలకొండపల్లి :** ప్రతీ ఒక్కరూ ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నదే తన ఆకాంక్ష అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. నేలకొండపల్లి మండలం శంకరగిరి తండాలో జరిగిన శ్రీ సీతారామ లక్ష్మణ, ఆంజనేయ, శిఖర, ధ్వజ ప్రతిష్టా మహొత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... ప్రజలందరూ ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని, వివిధ రంగాల్లో ఉన్న వారందరినీ ఉన్నత శిఖరాలకు చేర్చాలని దేవుణ్ణి కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం మంగాపురం తండా తదితర ప్రాంతాల్లో జరిగిన వివాహ వేడుకల్లో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని నూతన వధూవరులను ఆశీర్వదించి పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించారు.

# మృతుల కుటుంబానికి కేహెచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత





**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :**పల్లెర్ల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబామైన మోత్కూర్ శంకరయ్య మంటిపల్లి సాయిలు మృతి చెందరూ ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డి సహకారంతో గ్రామ మాజీ సర్పంచ్ నాయిని నర్సింహా రెడ్డి చేతుల మీదుగా శంకరయ్య కుటుంబానికి 5000 వేలు సాయిలు కుటుంబానికి 5000 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సామ నరేందర్ రెడ్డి, అంబోజు నాగయ్య, కంబాలపెల్లి సురేందర్,యాదవ సంఘం అధ్యక్షులు మంటిపెల్లి వెంకటేష్,గుణవేణి స్వామి,గోరిపెల్లి మల్లారెడ్డి నిమ్మారెడ్డి అశోక్ రెడ్డి మేడి రవి,పెసరకాయల నర్సిరెడ్డి,జన్నపాల శేఖర్ కొమ్ము ముత్తయ్య,మచ్చగిరి రాజు, సతీష్ దండు శశి తదితరులు పాల్గొన్నారు

# అమ్మకి వందనం



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మే 11 :** మాతృదినోత్సవం సందర్భంగా వివేకానంద ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న మాతృమూర్తులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆ సంస్థ సభ్యులు మరియు నిర్వాహకులు సంయుక్తంగా నిర్వహించారు.నిర్వాహకులు మాట్లాడుతూ ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, తమ కుటుంబ సభ్యులెవరూ లేని పరిస్థితుల్లో ఆశ్రమంలో చేరిన ఈ తల్లులు, అందరితో కలసి మెలిసి ఆనందంగా జీవిస్తున్నారు. వారి సేవకు గుర్తింపుగా ఈ రోజు పాదాభివందన కార్యక్రమం నిర్వహించడం జరిగింది, అన్నారు. ప్రత్యేకంగా వివేకానంద ట్యూషన్ విద్యార్థులు తల్లుల గురించి ఎంతో భావోద్వేగంతో మాట్లాడారు. తల్లుల కోసం తాము చేసే తక్కువ సేవలను గుర్తుచేసుకొని, కొంతమంది విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు.ఈ కార్యక్రమంలో ఆశ్రమ వాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం క్రికెట్ ఛాంపియన్ ట్రోఫీ ప్రారంభించిన మున్సిపల్ మాజీ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి.

- కాపు కృష్ణ టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),మే 11,**శ్రీ శ్రీ ఎన్ ఆర్ ఫామ్ ల్యాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొత్తగూడెం క్రికెట్ ఛాంపియన్స్ ట్రోఫీ స్థానిక ప్రకాశం స్టేడియంలో ఈనెల నాలుగో తేదీన నుండి టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్లో మొత్తం .16 జట్లు పాల్గొన్నాయి ఆదివారం జరిగే మొదటి సెమీ ఫైనల్ లో సింగరేణి బ్లాక్ డైమండ్స్ వర్సెస్ న్యూ స్టార్స్ రుద్రంపూర్ వారి మధ్య జరిగే మ్యాచ్ టాస్ వేసి ప్రారంభించిన టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ కార్యదర్శి కాపుకృష్ణ. బ్యాటింగ్ చేసి మ్యాచ్ ను ప్రారంభించిన కొత్తగూడెం మున్సిపాలిటీ తాజా మాజీ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి. వారు మాట్లాడుతు క్రికెట్ ఆడటం వల్ల ఆహ్లాదము ఆరోగ్యం స్నేహం పెంపొందుతాయిని గెలుపోటములు సహజమని అందరం ఐకమత్యంతో మెలగాలని అన్నారు. నిర్వాహనాలో పాల్గొన్నవారు వెంకట భాస్కర్, మహేష్,అభిషేక్, విశ్వనాథ్, తేజ్, దీపు, యశ్వంత్, ఆసిఫ్, చరణ్,సురేష్, రఫీ, రమేష్, విజయ్, నిశాంత్, సుధీర్, షణ్ముఖ, నాగరాజు, బాలు తదితరులు పాల్గొన్నారు.

# రామాలయం పరిసర ప్రాంతంలోని కరకట్టపై పోస్తున్న చెత్త డంపింగ్ యార్డ్ ను తరలించాలి.

- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న గ్రామ పంచాయతీ అధికారులు...
- చెత్త పొగతో శ్రీరాముడికి ధూపం వేస్తున్న గ్రామపంచాయతీ అధికారులు..
- సిపిఎం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ట్రాక్టర్లను ఆపి ఆందోళన చేస్తున్న ప్రజలు...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 11,**రామాలయంకు కూతవేటు దూరంలో కరకట్ట పై పోస్తున్న చెత్త డంపింగ్ ను పట్టణ శివారుకు తరలించాలని, ప్రజల ప్రాణాలతో చలగాట మాడుతున్న గ్రామ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వీడాలని సిపిఎం ఆధ్వర్యంలో ముదిరాజ్ బజారు, సప్తా దిగువ, రామాలయం పరిసర ప్రాంతాల ప్రజలు కరకట్ట పైకి చెత్తను తరలిస్తున్న పంచాయితీ వాహనాలను అడ్డుకొని ఆందోళన నిర్వహించడం జరిగింది.. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యం. బి. నర్సారెడ్డి లు మాట్లాతు పట్టణం లో సేకరించిన చెత్తను కరకట్టపై పోసి తగలబెట్టడం తో పొగ కమ్ముకుని రామాలయం వైపు, కాలనీ వైపు పొగ వ్యాప్తి చెందడంతో రామాలయం వచ్చే భక్తుల తో పాటుగా పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న కాలనీ ప్రజలు తీవ్ర అస్వస్థలకు గురవుతున్నారని అన్నారు. నిత్యం డంపింగ్ చేస్తున్న చెత్త వల్ల వస్తున్న దుర్వాసన, పొగ కాలుష్యం కారణంగా పరిసర ప్రాంత ప్రజలు శ్వాసకోశ వ్యాధులు, లివర్, కిడ్నీ, క్యాన్సర్ సంబంధిత వ్యాధులకు గురవుతున్నారని, ప్రజల ప్రాణాలు తీసుకున్న డంపింగ్ యార్డ్ ను శాశ్వతంగా ఇక్కడి నుంచి తరలించాలని అన్నారు. గతంలో సిపిఎం నిర్వహించిన పోరాట ఫలితంగా సుందరయ్య కాలనీలో చెత్త డంపింగ్ యార్డ్ ను నిర్మించారని, దాన్ని అట్టహాసంగా ప్రారంభించామని చెప్పుతున్న మంత్రులు అధికారులు స్థానిక ఎమ్మెల్యే పట్టణంలో సేకరించిన చెత్తను కరకట్ట పైన తీసుకొచ్చి ఎందుకు పోస్తున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. భద్రాచలం శ్రీరాములు వారికి గ్రామ పంచాయతీ చెత్త పొగతో నిత్యం ధూపం పడుతున్నారని విమర్శించారు. ఈ సమస్య పట్ల జిల్లా కలెక్టర్ గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఐటీడీఏ పీవో స్పందించాలని కోరారు.ప్రజల ప్రాణాల పట్ల గ్రామ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే చెత్త డంపింగ్ యార్డ్ ను పట్టణ శివారుకు తరలించాలని లేనియెడల ప్రజా ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు పట్టణ కమిటీ సభ్యులు చుక్కా మాధవరావు శాఖ కార్యదర్శి ధనలక్ష్మి, స్థానిక ప్రజలు సీత, హైమావతి, రామలక్ష్మి, రమణ, సీతామహాలక్ష్మి, రమేష్,రాంబాబు పిలక రెడ్డి, ఏసు,కళావతి తదితరులు పాల్గొన్నారు.

# మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి..



ఏ జే రమేష్..సిఐటియు జిల్లా కార్యదర్శి..

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 11,** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ఉద్యోగ విధానాలను నిరసిస్తూ, కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీ జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ కోరారు. భద్రాచల పట్టణ సిఐటియు పట్టణ కమిటీ సమావేశం ఎస్ అజయ్ కుమార్ అధ్యక్షతన కామ్రేడ్ బండారు చందర్రావు భవన్లో జరిగింది. ఈ దేశవ్యాప్త సమ్మెలో 10 కేంద్ర కార్మిక సంఘాలతో పాటు రాష్ట్ర కార్మిక సంఘాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు పాల్గొంటున్నాయని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు లాభం చేస్తూ కార్మిక ఉద్యోగులను దెబ్బతీస్తోందని, ఇటువంటి నిర్ణయాలకు వ్యతిరేకంగా 20వ తేదీ జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రమేష్ పిలుపునిచ్చారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం పని గంటలను పెంచుతోందని జీతాలు తగ్గిస్తుందని కార్మికులకు ఉన్న కొద్దిపాటి సౌకర్యాలను తీసివేస్తోందని అన్నారు. కావున కార్మికులు ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ సమ్మెలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు, సిఐటియు సీనియర్ నాయకులు ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ 20వ తేదీ స్థానిక ఎండిఓ కార్యాలయం నుండి ప్రదర్శన ఉంటుందని అందులో కార్మికులు ఉద్యోగులు పాల్గొనవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో సిఐటియు పట్టణ నాయకులు కొలగాని రమేష్, నకిరికంటి నాగరాజు, సంద్ర భూపేందర్, గుమ్మడి నాగరాజు, ఎన్ వెంకటలక్ష్మి, పి శివకుమారి, యు రమా, చంటి, ఎన్ సంతోష్, టీ ముత్తయ్య, జె ప్రసాద్, అప్పారి రాము, పి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# పాల్వంచలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 11,**పాల్వంచలో ఆదివారం జరిగిన పలు కార్యక్రమాల్లో రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.పాల్వంచ మండలం పరిధిలోని పాండురంగాపురం గ్రామంలో తవిశల గూడెం పంచాయితీ మాజీ ఉపసర్పంచ్ లింగం శ్రీను తల్లి ఇటీవల మరణించగా ఆదివారం ఆమె దశదినకర్మల్లో కొత్వాల పాల్గొని సంతాపం సానుభూతి తెలిపారు. స్థానిక బొల్లేరు గూడెం నివాసి కుంజా శ్యామ్ వివాహం సందర్భంగా కొత్వాల పాల్గొని వధూవరుల ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జడ్పిటిసి సభ్యులు ఎర్రంశెట్టి ముత్తయ్య సొసైటీ డైరెక్టర్లు మైనేని వెంకటేశ్వరరావు (బాబు), ఎర్రం శెట్టి మధుసూదన రావు, అడ్వకేట్లు తుమ్మల శివారెడ్డి, పిట్టల రామారావు, సోమ వెంకటరెడ్డి, పవన్, బై శ్రీను, బండి నాగరాజు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పాత నేరస్థులకు సీఐ కౌన్సెలింగ్



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మే 11:** రూరల్ సర్కిల్ పరిధిలో గల పాత నేరస్థులకు రూరల్ సీఐ రేవతమ్మ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాత నేరస్తులు గత జీవితాన్ని మరిచి నూతన జీవన దిశగా అడుగులు వేయాల్సిన అవసరాన్ని వివరించారు. నేరాలకు దూరంగా ఉండి, చట్టాన్ని గౌరవిస్తూ సమాజంలో మంచి పౌరులుగా మారాలని సూచించారు. మంచిగా మారిన వారికి పోలీస్ శాఖ సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. వారికి స్వయం ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ పథకాల గురించి వివరించి, మానసిక ధైర్యం కల్పించారు. ఇప్పటికైనా పాత నేరస్తులలో మార్పు రావాలని పిలుపునిచ్చారు.

# వేసవిలో "చల్లని" సేవ చేస్తున్న చిన్నారులు.





**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 11,**అశ్వాపురంలో మండుటెండలో పయనించే బాటసారుల దాహార్తి తీర్చేందుకు మండల కేంద్రం లోని చింతల బజార్ చిన్నారులు చంద్ర వినీత్, పున్నం సాత్విక్, వరిమట్ల రాము, బోల్లం మనోజ్, గోకినపల్లె నిక్కీ తమ వంతు సహాయం అందిస్తున్నారు. తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులతో చాక్లెట్లు, బిస్కెట్లు కొనుక్కోకుండా ఆ డబ్బులతో మజ్జిగ, నిమ్మరసం అందించి ఔదార్యం చాటుతున్నారు. అశ్వాపురం మెయిన్ రోడ్డు నుండి జగదాంబ సెంటర్ మీదుగా కాలువ బజార్, హై స్కూల్ సెంటర్, ఎస్సీ కాలనీ, తురుమల గూడెం తండా, గొందిగూడెం, వందరోజుల పని కి వెళ్లి వచ్చే కూలీలకు ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలను ఆపి మజ్జిగ నిమ్మరసం ను ఉచితంగా అందిస్తూ బాటసారుల దాహం తీరుస్తున్నారు. చిన్నారులు చేస్తున్న సేవలకు బాటసారులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారు.

# ఆదివాసి విద్య కుసుమం జ్యోతిర్మయి......!

● ఏజెన్సీ "విద్యా జ్యోతి"ర్మయి కి అభినందనల వేలువ.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),మే 11,**ఏజెన్సీ మారు మూల ప్రాంతమైన చర్లలో ప్రాథమిక విద్యను అభ్యసించి ఫిజిక్స్ విభాగంలో పీహెచ్డీ పూర్తి చేసి డాక్టరేట్ సంపాదించిన ఆదివాసి విద్య కుసుమం ఈసం జ్యోతిర్మయి కి అభినందనల వెల్లువ కొనసాగుతుంది. పోలీస్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఈసం అనంతయ్య జగన్మోహిని ల కుమార్తె అయిన జ్యోతిర్మయి మొదటి నుండి తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇంటర్ డిగ్రీ లను పూర్తిచేసి ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ ఫిజిక్స్ పూర్తి చేయడంతో పాటు ఉస్మానియా యూనివర్సిటీలోనే ఫిజిక్స్ పిహెచ్డి పూర్తి చేసి డాక్టరేట్ సాధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తో పాటు భద్రాచలం ఏజెన్సీకే విద్యా జ్యోతి గా నిలిచారు.

ఆదివాసి కుటుంబంలో జన్మించిన జ్యోతిర్మయి చిన్ననాటి నుండే తన కలను సాకారం చేసుకునేందు కు విద్యనే ప్రధాన ఆయుధంగా చేసుకొని తండ్రి అనంతయ్య సలహాలు సూచనలతో పాటు తల్లి జగన్మోహిని ప్రోత్సాహంతో నిరంతరం విద్య పైనే దృష్టి సారిస్తూ నేడు డాక్టరేట్ సాధించి విద్యకు పేదరికం అడ్డురాదని నిరూపించారు.

"విద్యా జ్యోతి"ర్మయికి అభినందనల వెల్లువ...

ఫిజిక్స్ విభాగంలో పీహెచ్డీ పూర్తి చేసి డాక్టరేట్ సాధించిన జ్యోతిర్మయిని భద్రాచలంలో పలు స్వచ్ఛంద సంస్థలతో పాటు పలురు ప్రముఖులు అభినందించి సత్కరిస్తున్నారు. ఆదివారం ప్రభా శంకర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైజాగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చైర్మన్ జివిఎస్ శంకర్రావు పట్టణంలోని భగవాన్ సూపర్ మార్కెట్ ఆవరణలో జ్యోతిర్మయిని ఘనంగా సన్మానించి ఆమె తల్లిదండ్రులైన అనంతయ్య జగన్మోహినిలను సత్కరించారు. ఈ సందర్భంగా జివిఎస్ శంకర్రావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో విద్య ను అభ్యసించి ఫిజిక్స్ విభాగంలో పీహెచ్డీ పూర్తి చేసిన ఆదివాసి విద్య ఆణిముత్యం జ్యోతిర్మయి అని కొని ఆడారు. ఆడపిల్లలకు అవకాశం కలిపిస్తే సాధించలేనిది ఏమీ లేదని జ్యోతిర్మయి మరోసారి నిరూపించారని అన్నారు. పోలీస్ విభాగంలో విధులు నిర్వహించే వారికి 24 గంటలు 365 రోజులు పని ఒత్తిడి అధికంగా ఉండటంతో కుటుంబాని కి సమయం పూర్తిస్థాయిలో కేటాయించే అవకాశం తక్కువగా ఉంటుందని అయినప్పటికీ అనంతయ్య తన కుమార్తెను ఉన్నత స్థాయిలో చూడాలని లక్ష్యంతో తనకు కావలసిన సలహాలు సూచనలు అందిస్తూ ప్రోత్సహించారని తల్లి జగన్మోహిని సైతం అనునిత్యం కూతురుకి కావలసిన సహకారాన్ని అందిస్తూ జ్యోతిర్మయి విజయంలో కీలకంగా వ్యవహరించారని అన్నారు. మాతృ దినోత్సవ సందర్భంగా జ్యోతిర్మయి వంటి విద్యావేత్తలను సన్మానించడం గర్వకరమని జ్యోతిర్మయి భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి భద్రాచలం ఏజెన్సీకి గొప్ప పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ కానిస్టేబుల్ కవి ప్రసాద్ పాల్గొని జ్యోతిర్మయిని అభినందించారు.

# ఎప్ సెట్ ఫలితాలలో లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థుల ర్యాంకుల మోత.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 11,**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎప్ సెట్ ఫలితాలలో లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు ర్యాంకుల మోత మోగించి ప్రభంజనం సృష్టించి రాష్ట్రస్థాయి లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులైన ఎంపీసీ విభాగం లో గుడుమసు జ్యోత్స్నా ప్రియ (2524ఈ06237) 5955 ర్యాంక్, మొహమ్మద్ సన తబస్సుమ్ (2525జె01028) 7283 ర్యాంకు, దాట్ల దివ్య దర్శిని (2522జి03005) 10067 ర్యాంక్ కవురు జాహ్నవి 2526హెచ్05173) 12976 ర్యాంక్, బాజీ మోక్షిత (2521 హెచ్ 05090) 14998 ర్యాంక్, తలబత్తుల ఎస్ ఎస్ హెచ్ వంశీ ధర్ (2522 కె 02051) 15908 ర్యాంక్ సాధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచారు. అదేవిధంగా బైపీసీ విభాగం లో ఒంటెద్దు గ్లోరీ (2511 హెచ్ 06440) 8994 ర్యాంకు, కుంజా సాయి పూజిత (2511 హెచ్ 01067) 12673, దాసరి స్రావిక(2513 జె 01104) 17611 ర్యాంక్ సాధించి సత్తా చాటారు. గత నెలలో ప్రకటించిన ఇంటర్ పరీక్ష ఫలితాలలో మొదటి సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ విభాగంలో 468 మార్కులు తోపాటు బైపీసీ విభాగంలో 438 మార్కులు సాధించి సత్తా చాటిన విషయం తెలిసిందే ద్వితీయ సంవత్సర ఫలితాలలో 993 మార్కులు సాధించి రాష్ట్రంలోనే లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచిన లిటిల్ ఫ్లవర్స్ సంస్థలు ఎంసెట్లో కూడా ఉత్తమ ప్రతిభను కనపరిచి ర్యాంకులు సాధించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ఆవరణలో డైరెక్టర్లు మాగంటి రమేష్ బాబు మాగంటి శ్రీనివాస వర ప్రసాద్ బాబులు మెమెంటో ఇచ్చి సత్కరించి మాట్లాడుతూ లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల లో విద్యార్థులు 60 మందికి పైగా ఎంసెట్ లో అర్హతను సాధించారని అన్నారు. అదేవిధంగా ఇంటర్లోను, ఎంసెట్ మరియు మెయిన్స్ లోను ఉత్తమ ప్రతిభను కనబరిచారని అన్నారు. ఇంటర్ ఫలితాలలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచిన లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు జే ఈ ఈ మెయిన్స్ వెబ్సైట్ ఫలితాలలో ర్యాంకులు మాత మోగించడం గర్వకరమని అన్నారు. ఈ ఫలితాలు తమపై బాధ్యత మరింతగా పెంచాయని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. ఈ విజయానికి కారుకులైన విద్యార్థుల తల్లితండ్రులు ఉపాధ్యాయ సిబ్బందిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బషీర్ తో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.
ఎప్ సెట్ ఫలితాలలో లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థుల ర్యాంకుల మోత.

# ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 11,**బూర్గంపాడు మండలం సోంపల్లి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇల్లు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని చెప్పరు బేస్ మీట్ వరకు పూర్తి చేసిన వెంటనే లక్ష రూపాయలు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని పేర్కొన్న పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు.

ఈ యొక్క కార్యక్రమంలో మురుగంపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుర్గంపూడి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారుద

# సురేష్ బాబు తోటమళ్లకు" కవిరత్న "జాతీయ పురష్కారం.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 11,**భద్రాచలం పట్టణానికి చెందిన ఫీజికల్ సైన్స్ స్కూలు అసిస్టెంట్ ఉపాధ్యాయుడు ,ప్రముఖ కవి సురేష్ బాబు తోటమళ్లకు "కవిరత్న " జాతీయ పురష్కారం లభించింది .ఏలూరులో మే 10 ,11 తేదీలలో జరిగిన శ్రీశ్రీ కళావేదిక ప్రపంచ సాహితీ సంబరాలలో సురేష్ బాబు తన కవితా గళం వినిపించారు .ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్ ,శ్రీశ్రీ కళావేదిక సీఈఓ కత్తిమండ ప్రతాప్ లు ఈ సందర్భంగా సురేషబాబు కు కవిరత్న జాతీయ స్థాయి పురష్కారాన్ని అందించి జ్ఞాపిక ,శాలువాలతో ఘనంగా సత్కరించారు .ప్రపంచ స్థాయిలో భద్రాద్రి ఖ్యాతిని చాటిన సురేష్ బాబు తోటమళ్ళను చర్ల మండల విద్యాధికారి ,తేగడ హై స్కూలు ప్రధానోపాధాయ్యుడు పీవీ రమణ అభినందించారు . ఇప్పటికే పలు పురష్కారాలు పొందిన సురేష్ బాబు ఇటీవల ప్రకటించిన పది ఫలితాలలో సైన్స్ సబ్జెక్ట్ లో నూరు శాతం ఫలితాలు సాధించారు .



# రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న వన్ టౌన్ సీఐ జీడీ బాబు



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మే 11 :** వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సమావేశంలో పోలీస్ ఇన్స్పెక్టర్ జి.డి. బాబు పాల్గొన్నారు మరియు రౌడీషీటర్లకు పలు కీలక సూచనలు చేశారు. ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, ఎవరిట్కనా చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినట్లయితే వారిపై పీడీ యాక్ట్ లేదా నగర బహిష్కరణ వంటి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రజాశాంతికి భంగం కలిగించే చర్యలపై మినహాయింపు ఉండదు, అని హెచ్చరించారు.
అలాగే, మంచి ప్రవర్తన చూపిస్తూ చట్టాన్ని గౌరవించే రౌడీషీటర్లకు ప్రోత్సాహం అందించడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. అవసరమైతే వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, అలాగే వారి రౌడీ షీట్లు క్లోజ్ చేయాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో పోలీసు అధికారులతో పాటు రౌడీషీటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేసవి క్రీడ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

క్రీడాకారులకు బిస్కెట్లు పంపిణీ చేసిన కూనపురి కవిత.



**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మే 11.**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం ఈనెల 1 నుండి ప్రారంభించారు ఈనెల 30 వరకు కొనసాగుతుంది ఈ శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని హైస్కూల్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ వారు కోరారు అంతేకాకుండా హై స్కూల్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిరోజు క్రీడాకారులకు పండ్లు బిస్కెట్లు అందజేయడం జరుగుతుందని తెలిపారు అదే విధంగా ఆదివారం తెలంగాణ ఉద్యమకారుడు బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పోరాడిన కునపురి రాములు 11వ వర్ధంతి సందర్భంగా మాజీ మార్కెట్ చైర్మన్ కునపురి కవిత ఆధ్వర్యంలో క్రీడాకారులకు బిస్కెట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు మానసికంగా ఉల్లాసంగా ఉండడానికి ఆటలు ఎంతో దోహదపడతాయని అన్నారు మరియు మంచిగా చదువుకొని పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆమె కోరారు అదేవిధంగా మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ వారు మాట్లాడుతూ దాతలు ఎవరైనా ముందుకు వచ్చి వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నాం ఈ కార్యక్రమంలో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బచ్చు శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శులు పోలేపాక బిక్షపతి నాగేల్లి వల్లి ఉపాధ్యక్షులు మైసొల్ల శ్రీకాంత్ సభ్యులు ఎడవెల్లి అనీల్ గాడిపల్లి అశోక్ హై స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు గంధమల్ల స్వామి రాజ్ వేసవి శిక్షణ శిబిర ఇన్చార్జ్ పోలేపాక సాయికుమార్ మత్స్యగిరి క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

# ఆదివాసీ యువతికి ఓయూ నుంచి డాక్టరేట్



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),మే 11,**భద్రాచలానికి చెందిన ఈసం జ్యోతిర్మయికి ఉస్మానియా యూనివ ర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. భౌతిక శాస్త్రంలో ఆమె సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గురువారం డాక్టరేట్ ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కుమార్తె అనురాధ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పీహె చీ (ఆర్ట్స్) పూర్తి చేసిన మొదటి ఆదివాసీ మహిళ కాగా, భౌతిక శాస్త్రంలో డాక్టరేట్ సాధించిన ఆదివాసీగా జ్యోతిర్మయి రికార్డు సృ ష్టించారు. ఆమె తండ్రి అనంతయ్య భద్రాచలం పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబు ల్గా విధులు నిర్వర్తిస్తుండగా, పలువురు శు భాకాంక్షలు తెలిపారు.

# స్వార్ధం లేని ప్రేమకు తల్లి ప్రేమ ప్రతీక.



సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),మే 11,**కొత్తగూడెం (రామవరం)స్వార్ధం లేని ప్రేమకు తల్లి ప్రేమ ప్రతీక అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని రామవరం సెంటర్లో మదర్స్ డే సందర్భంగా జంజర్ల కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవంలో అయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరి జీవితంలో తల్లి మొదటి స్నేహితురాలిని, మొదటి గురువని పేర్కొన్నారు. మాతృశక్తి లేనిదే సమాజం లేదని,. మహిళా శక్తి లేకుండా దేశ అభివృద్ధి జరగదని, తల్లుల అభివృద్ధే కుటుంబాల అభివృద్ధి, అదే దేశ అభి వృద్ధికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. కనిపెంచిన తల్లిదండ్రులు మరువవద్దని, వారిని కడదాకా కంటికిరెప్పలా కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాపు సీతాలక్ష్మి, నాయకులు కంచర్ల జమలయ్య, జి వీరాస్వామి, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీను, ఎస్ కె ఫహీమ్, పాటి మోహన్, మాతంగి లింగయ్య, మాటేటి గోపాల్, గురుమూర్తి, గోపి, తూముల శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, ఖయూమ్, నగేష్, అంకూస్, సింగిరాల రమేష్, దాసు, జలీల్, రణధీర్, మర్రి కృష్ణ, విజయలక్ష్మి, దార లక్ష్మి, శంకర్, దాట్ల శ్రవణ్, అలీం, అనీఫ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బైకు అదుపుతప్పి యువకుడు, మృతి

**మే 11 ( సీకే న్యూస్) చేగుంట :** చేగుంట మండల్ కర్ణాలపల్లి శ్రీ రేణుక ఎల్లమ్మ గుడి వద్దకు దైవదర్శనానికి వచ్చి బైక్ అదుపుతప్పి మృతి చెందిన సంఘటన చేగుంట మండలం జరిగింది, వివరాలకు వెళితే రామయంపేట్ మండలం దంతాపల్లి గ్రామానికి చెందిన కేసరి ప్రవీణ్ (25) తమ బంధువులు కర్నాలపల్లి, శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద అమ్మవారి మొక్కు చెల్లించడానికి వచ్చిన వారి బంధువులు, ఆ యొక్క పండగకు పిలువగా పండగకు వచ్చి, దైవ దర్శనం చేసుకుని, తిరిగి వెళుతుండగా టిఎమ్ఆర్ వెంచర్ వద్ద బైకు అదుపుతప్పి అక్కడికక్కడే మృతి చెందాడు ఇట్టి విషయంలో కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్ ఐ జి,చైతన్య కుమార్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు



## అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న వాహనాలను
# తనిఖీ చేస్తున్న వన్ టౌన్ సీఐ జీడీ బాబు



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మే 11 :** వన్ టౌన్ పోలీస్ స్టేషన్ విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, నేటి రోజు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో నాకాబంది (వాహన తనిఖీ) కార్యక్రమం చేపట్టబడింది. ఈ తనిఖీలను ఇన్స్పెక్టర్ జి.డి. బాబు స్వయంగా పర్యవేక్షించారు. ఈ నాకాబంది సందర్భంగా అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న వాహనాలను ఆపి వాటి సంబంధిత పత్రాలు %-% రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్ సి ), బీమా (ఇన్సూరెన్స్), డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు మొదలైనవి పరిశీలించబడినవి. ప్రతి ఒక్కరు ఈ రకమైన తనిఖీలకు సహకరించి, కోరిన పత్రాలను వెంటనే చూపించాలని పోలీసులు కోరారు. ఇన్స్పెక్టర్ తెలిపారు ఇటువంటి నాకాబంది కార్యక్రమాలు ఇకనుంచి ప్రతిరోజూ వన్ టౌన్ ప్రాంతంలోని వివిధ చోట్ల క్రమం తప్పకుండా నిర్వహించబడతాయి. అసాంఘిక కార్యకలాపాలు చేసే వారు, మద్యం సేవించి అల్లరి చేసే వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఈ నాకాబంది సందర్భంగా రికార్డు లేని ఒక ఆటో మరియు ఆరు మోటార్ సైకిళ్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# పార్టీ విస్తరణకు సిపిఐ శ్రేణులు కృషి చేయాలి.

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 11,**కొత్తగూడెం (రామవరం) : పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేవిధంగా కృషి చేయడం ద్వారా పార్టీ విస్తరణకు నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలనీ సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని రామవరం సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కార్మికవర్గానికి, పేదప్రజలకు అనునిత్యం సేవలందించేది కమ్యూనిస్టు పార్టీ, ఏఐటీయూసీనేనని అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో సిపిఐకి ఎదురులేదని, ప్రజలకు అందించిన సేవల ఫలితంగాలో రోజురోజుకు జనాదరణ పెరుగుతుందని అన్నారు. కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని, ఎమ్మెల్యే కూనంనేని కృషితో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో నాయకులు కంచర్ల జమలయ్య, జి వీరాస్వామి, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీను, ఎస్ కె ఫహీమ్, పాటి మోహన్, మాతంగి లింగయ్య, మాటేటి గోపాల్, గురుమూర్తి, గోపి, తూముల శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, ఖయూమ్, నగేష్, అంకూస్, సింగిరాల రమేష్, దాసు, జలీల్, రణధీర్, మర్రి కృష్ణ, విజయలక్ష్మి, దార లక్ష్మి, శంకర్, దాట్ల శ్రవణ్, అలీం, అనీఫ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి దేవస్థానం సింహాచలం కార్య నిర్వహణ అధికారి గా బాధ్యతలు స్వీకరించిన ఈవో ఎన్. సుజాత



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మే 11 :** దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఎన్. సుజాత ఆదివారం సింహాచలం దేవస్థానం ఇ ఓ (ఆర్ ఏ సి ) గా ఛార్జ్ తీసుకున్నారు. సింహాచలం దేవస్థానం ఈవోగా నియమించిన సుజాత మొదటిగా అప్పన్న స్వామి వారిని దర్శించుకు న్నారు వీరికి ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి నక్కాన ఆనంద్ కుమార్ ప్రధాన అర్చకులు శ్రీనివాస చార్యులు సాదర స్వాగతం పలికి ముందుగా కప్పస్తంభం ఆ లింగనము తదుపరి బేడా ప్రదక్షణ చేయించి స్వామి వారి దర్శనము అనంతరము వేద పండితులు వేద ఆశీర్వచనము ఇచ్చారు అనంతరము స్వామివారి పటము ప్రసాదాలను ఆలయ సహాయ కార్య నిర్వహణ అధికారి ఆనంద్ కుమార్ అందించారు . వీరితో వైదిక సిబ్బంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డివి రామరాజు ఆలయ పర్యవేక్షకులు జి వి ఎస్ కే ప్రసాద్ ,కంచి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చెన్న కేశవ స్వామి ఆలయానికి ధ్వజస్తంభం బహుకరణ.

**దాత గంజి వెంకట్ పాపిరెడ్డి అరుణ దంపతులు.**

**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మే 11.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త గంజి వెంకట్ పాపిరెడ్డి అరుణ దంపతుల ఆధ్వర్యంలో శ్రీచెన్న కేశవ స్వామి ఆలయానికి ధ్వజస్తంభం బహుకరించారు అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలోని ఆలయ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేశామని శ్రీ చెన్నకేశ్వర స్వామి ఆశీస్సులు మాకు ఎల్లప్పుడూ ఉండాలని వారు కోరారు అంతేకాకుండా ప్రతి సంవత్సరం గ్రామంలో శ్రీ చెన్నకేశ్వర స్వామి జాతర ఘనంగా నిర్వహిస్తారని ప్రతి సంవత్సరం శ్రీ చెన్న కేశవ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ప్రతి సంవత్సరం ప్రతి బ్రహ్మోత్సవాలకు మా కుటుంబ సభ్యులు పాల్గొంటామని మాకు తోచిన సహాయం చేస్తామని భగవంతుని ఆశీస్సులు మా కుటుంబానికి ఎల్లవేళలా ఉన్నాయని ఈ సందర్భంగా



తెలిపారు, ఈ కార్యక్రమంలో గంజి నకుల్ రెడ్డి నికిత శీనయ్య కొమురెల్లి మసూదన్ రెడ్డి కొమురెల్లి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎండలకు భక్తులు అవస్థలు...





● కాలిబాట కొరకు "కార్పెట్లు" ఏర్పాటు చేయాలని వేడుకోలు.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 11,**
పాఠశాలలకు కళాశాలలకు సెలవులు కావడం...
దక్షిణ అయోధ్య భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దివ్య దర్శనానికి భక్తుల రద్దీ పెరిగింది. నిత్యం వేల సంఖ్యలో భక్తులు విచ్చేస్తున్నారు. మే నెల కావడం ఎండలు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దేవస్థానం వారు కేవలం... పడమర మెట్ల నుండి అన్నదాన సత్రం వరకే కార్పెట్లు ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో ప్రసాదాల కౌంటర్ నుండి అన్నదాత సత్రం, పడమర మెట్లు వైపుగా నడుచుకుంటూ వెళ్లాలంటే లి"కాలిబాట నిప్పురవ్వలు" కక్కుతుండడంతో లబోదిబోమంటూ అవస్తులు



పడుతున్నారు భక్తులు. వృద్ధులు, చిన్నారులు పరిస్థితులు చెప్పనవసరం లేదు. తక్షణమే రామాలయం అధికారులు స్పందించి భక్తులకు కార్పెట్లు ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు...

# దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలు.....!

**నిరుపేద మాతృమూర్తులకు చీరలు పంపిణీ**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 11,**దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలో ఆదివారం మాతృ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలువురు పేద మాతృమూర్తులను గుర్తించి వారిని సత్కరించి చీరలను పంపిణీ చేశారు. అనంతరం దిశ ప్రొటెక్షన్ కార్యాలయంలో కేకును కట్ చేసి మాతృ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు పూజల లక్ష్మీ మాట్లాడుతూ సృష్టికి మూలమైన మాతృ మూర్తులను గౌరవించడం ప్రతి ఒక్కరి కనీస ధర్మం అని అన్నారు. నవ మాసాలు మోసి జన్మనించడమే కాకుండా సమాజంలో ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దేందుకు తల్లి చేయని శ్రమ ఉండదని అటువంటి మాత్రం మూర్తులను కడవరకు పూజించడంతోనే మానవ జన్మ పరిపూర్ణమవుతుందని అన్నారు. ఎంతోమంది మాతృమూర్తులు ఆదరణ లేక ఆశ్రమాలలో తమ వృద్ధాప్యాన్ని గడిపోవటం దురదృష్టకరమని తల్లితండ్రులను వృద్ధాశ్రమాలలో చేర్పించే ప్రతి ఒక్కరు భవిష్యత్తులో వారు కూడా అటువంటి అనుభవాలే ఎదుర్కొంటారని అన్నారు. దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలతో పాటు మాతృ దినోత్సవ వేడుకలను కూడా ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని



ఆమె స్పష్టం చేశారు. జాతీయ అధ్యక్షులు బివి రాజు ఉపాధ్యక్షురాలు కళ్యాణి ల సారథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మాతృ దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని అందులో భాగంగా భద్రాచలంలో నిరుపేద మాతృమూర్తులకు చీరల పంపిణీ కూడా నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్రవంతి జ్యోతి తదితరులు పాల్గొన్నారు

# యుద్ధ సంక్షోభ సమయంలో ఢిల్లీ యూనివర్సిటీలో పరీక్షలు నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా పోతల ప్రసాదనాయుడు

**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మే 11:**దేశం ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో తీవ్రమైన యుద్ధ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇలాంటి సంక్షోభ సమయంలో విద్యార్థులు మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. భద్రతా పరిస్థితులు అనిశ్చితంగా మారిన ఈ సమయంలో ఢిల్లీ యూనివర్సిటీ తన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించడం దురదృష్టకరం. అన్ని అఖిలభరతీయ ఓబీసీ అధ్యక్షులు పోతలప్రసాదనాయుడు.
విద్యార్థుల భద్రతే ప్రధాన ప్రాధాన్యం కావాలి. వారు ప్రశాంత వాతావరణంలో విద్యను అభ్యసించాలన్నదే మా ఆకాంక్ష. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో పరీక్షలు నిర్వహించడం అన్యాయం మాత్రమే కాకుండా, విద్యార్థులపై అనవసరమైన ఒత్తిడిని తీసుకువస్తుంది. అతిగా ఒత్తిడితో విద్యార్థులు నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉంది. అందువల్ల, పరీక్షలను తాత్కాలికంగా వాయిదా వేసి, పరిస్థితులు నిలకడగా ఉన్న తర్వాత నిర్వహించాలని ఢిల్లీ యూనివర్సిటీ అధికారులను, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖను మా హృదయపూర్వక విజ్ఞప్తి చేశారు.



## తుమ్మల సేవా సమితి ఆధ్వర్యంలో
# భక్తులకు అన్నదానం.

అన్నదానం ఏర్పాటుచేసిన తుమ్మల కుటుంబ సభ్యులు.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మే 11.** యాదాద్రి భువనగిరి జిల్లా మండల పరిధిలోని అరూరు గ్రామంలో శ్రీ చెన్నకేశవ స్వామి మరియు బొడ్రాయి కట్ట మైసమ్మ పండుగల సందర్భంగా ఆదివారం కీర్తిశేషులు మాజీ ఎంపీపీ తుమ్మల నరసయ్య జ్ఞాపకార్థం తుమ్మల సేవాసమితి ఆధ్వర్యంలో వారి కుమారులు అన్నదాన కార్యక్రమం భక్తులకు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా ఇష్ట దైవమైన శ్రీ చెన్నకేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ చెన్నకేశ్వర స్వామి చాలా మహిమగల దేవుడని అన్నారు మా నాన్న జ్ఞాపకార్థం ఆలయానికి వచ్చిన భక్తులకు గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుమ్మల పద్మమ్మ తుమ్మల శ్రీనివాస్ అరుంధతి తుమ్మల శ్రీనివాస్ లక్ష్మి తుమ్మల శ్రీధర్ అపర్ణ ఏ దేవేందర్ జయశ్రీ ఏ ఉదయ్ రాజ్ అమూల్య ఏ వరుణ్ రాజ్ ఏ చరణ్ రాజ్ ఏ ప్రభాకర్ ఏ రాహుల్ ఏ తరుణ్ తుమ్మల కుటుంబ సభ్యులు భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మే 11.**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల సుంకిశాల గ్రామంలో తేదీ:11/05/25 ఆదివారం నాడు ఈతాప కమరాతి గారు అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకుని గ్రామ మాజీ సర్పంచ్ శ్రీమతి శ్రీ పైళ్ల సంధ్యా రాణి-ఉపేందర్ రెడ్డి గార్లు కమరాతి గారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు .అనంతరం వారు మాట్లాడుతూ,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు మరియు 5000/- రూపాయల ఆర్థిక సహాయం వారి కూతురు మనోహర గారికి అందజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కొండే కిష్టయ్య,మంగ జగన్, మంగ పాండు,గుర్రం సత్తిరెడ్డి,కాటపల్లి పాండు, గ్రామ పెద్దలు , తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

2004-2005 ఫరూక్ నగర్ మండలం వెలిజర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు



**సి కే న్యూస్ షాద్ నగర్:మే 11:**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం వెలిజర్ల గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004–2005 లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వైభవంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు 11–5–2025 ఆదివారం రోజు కలుసుకుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మాట్లాడుతూ,.. ఆనాడు అంతంత మాత్రమే సదుపాయాలు ఉన్న నాటి రోజుల్లో చదువుకున్న విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో ఉండడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. 20 ఏళ్ళ తరువాత కూడా తమను గుర్తుంచుకుని సత్కరించడం ఎంతో సంతోషం కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు...ఉపాధ్యాయులు..గ్రామ ప్రజా ప్రతినిధులు..పాల్గొన్నారు.

# రాజ్యాధికారం దిశగా కదం తొక్కుతున్న బీసీ మహిళలు

- ఫరూక్ నగర్ మండలము కందివనం గ్రామంలో గ్రామ కమిటీల ఎన్నిక
- ఫరూక్ నగర్ మండల జాతీయ బీసీ సేన మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ ఆధ్వర్యంలో



**సి కే న్యూస్ షాద్ నగర్:మే 11:**రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం కందివనం గ్రామంలో ఏర్పాటు చేసిన జాతీయ బీసీ సేన మహిళా కమిటీ ల ఎన్నిక కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వ సుధాకర్, జిల్లా నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గ కార్యదర్శి జూపల్లి చంద్రశేఖర్, బీసీ సేన ఫరూక్ నగర్ అధ్యక్షుడు మేకల వెంకటేష్ నియోజకవర్గ మహిళా నాయకురాలు స్రవంతి,, సరస్వతి కలిసి గ్రామ కమిటీల ఏర్పాటు చేసి నియామక పత్రాలను సంబంధిత కమిటీలకు అందజేయడం జరిగింది కమిటీలు 1.అక్షరాలుగా కావాలి అనురాధ ప్రధాన కార్యదర్శిగా జట్టిగారి యాదమ్మ మరో 10 మంది కమిటీ సభ్యులను అదేవిధంగా 2.మహిళా అధ్యక్షురాలుగా మల్కాపురం అండలు ప్రధాన కార్యదర్శిగా కావాలి అనురాధను ఎన్నుకోవడం జరిగింది. అనంతరం కమిటీని ఉద్దేశించి పలువురు మాట్లాడుతూ...మహిళలు ఆర్థిక విద్య సామాజిక రాజకీయ రంగాలలో రాణించి సమాజ ఉన్నతికి పాటుపడే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు బీసీలు వెనుకబాటుతనానికి గ్రామాలలో అవగాహనరాహిత్యం వల్లనే అభివృద్ధికి నోచుకోవడం లేదని అందరూ సంఘటితంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అని అన్నారు ప్రతి బిసి మహిళ రాజ్యాధికారం దిశగా ఆలోచించి అడుగులు వేయాలి అనీ అన్నారు.ఐకమత్యంతోనే అందలం ఎక్కగల శక్తి బీసీలకు ఉందన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు భారీ ఎత్తున పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయడం జరిగింది.


## మానహ హక్కుల మండల అధ్యక్షులుగా ఈశ్వర్



**మే 11 ( సీ కే న్యూస్) చేగుంట:**మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మొగుళ్ళ భద్రయ్య అధ్యక్షానా మెదక్ జిల్లా అధ్యక్షులు సాయి యాదవ్ ఆధ్వర్యంలో కొత్తగా జిల్లా కార్యవర్గం ను ఏర్పాటు చేయడం జరిగింది, జిల్లా కార్యవర్గంలో చేగుంట మండలానికి చెందిన మహమ్మద్ నదీమ్ హాసన్ ను జిల్లా జాయింట్ సెక్రెటరీగా, చింతాకుల లింగం ని కార్యవర్గ సభ్యులుగా, కానారం ని కార్యవర్గ సభ్యులుగా, పి.ఈశ్వర్ ని చేగుంట మండల అధ్యక్షులుగా, రాజ్ పురోహిత్ రామసింగ్ ని మెదక్ జిల్లా నేషనల్ హ్యూమన్ రైట్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రటరీగా నియమించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్యుల, సమస్యల మీద పోరాటం చేసేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని రామ్ సింగ్ రాజ్ పురోహిత్ అన్నారు,

# పల్లా అండ్ కో కోసం తెలుగు శక్తి శిక్షణ తరగతులు

- హెూటల్ దసపల్లా వేదికగా పది రోజుల పాటు నిర్వహణ
- పల్లా జన్మదినమైన ఈనెల 12 నుంచే తరగతులు ప్రారంభం
- నైతిక విలువలు, మాట్లాడే విధానంపై సీనియర్ ప్రొఫెసర్ బోధన
- తరగతులకు హాజరయ్యే వారికి మధ్యాహ్నం భోజనం ఉచితం
- పల్లా అండ్ కో ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ వెల్లడి



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మే 11 :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు పై.. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తన "దండయాత్ర" కొనసాగిస్తూనే ఉన్నారు. కూటమి గౌరవ సభలో పల్లా శ్రీనివాస రావు కౌరవుడు అంటూ ఇప్పటికే తీవ్ర వ్యాఖ్య చేసిన బి.వి.రామ్ మరింతగా దూకుడు పెంచారు. ఇదే అంశమై భీమిలిలో ఆదివారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బి.వి.రామ్ మాట్లాడుతూ.. వైసీపీకి కోవర్టుగా మారిన పల్లా అండ్ కో నైతిక విలువలు, ప్రత్యర్థులపై అయినా సంయమనం కోల్పోకుండా ఎలా మాట్లాడాలి తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలోనే పల్లా అండ్ కో కోసం ప్రత్యేక శిక్షణా తరగతులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అది కూడా పల్లా జన్మదినమైన, ఈ నెల 12వ తేదీ అంటే.. సోమవారం నుంచి శిక్షణా తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. హెూటల్ దసపల్లా వేదికగా నిర్వహించే శిక్షణా తరగతులు.. దివంగత ఎన్టీఆర్ కు దిశానిర్దేశం చేసిన సీనియర్ ప్రొఫెసర్ నేతృత్వంలో పది రోజులు పాటు కొనసాగుతాయన్నారు. తరగతులకు హాజరయ్యే వారికి హెూటల్ దసపల్లాలోనే మధ్యాహ్న భోజనం ఉచితంగా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులకు సీట్లు పరిమితంగా ఉన్నాయని.. ముందు వచ్చిన వారికి ముందు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ క్రమంలోనే ఉచిత శిక్షణ తరగతులకు హాజరు కాబోయే వారు ముందుగా తమ వివరాలను వాట్సాప్ రూపంలో తన నెంబర్ కు పంపించాలని విజ్ఞప్తి చేశారు. తన ఫోన్ నెంబర్, వాట్సాప్ నంబర్ తన మిత్రులు అందరి వద్ద ఉందని.. ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పల్లా ఇంకా అతని అనుచరులు ఈ శిక్షణ తరగతులకు హాజరు కావడం ద్వారా తమ బుద్ధిని వికసింప చేసుకోవాలని రామ్ హితవు పలికారు. ఎన్టీఆర్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి నిలువెత్తు రూపం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన దివంగత నందమూరి తారక రామారావు జయంతిని.. రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని తెలుగు శక్తి డిమాండ్ చేస్తుందని బి.వి.రామ్ అన్నారు. ఈ విషయమై ఇప్పటికే శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని స్వయంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశానని తెలిపారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించారని తమ విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారన్నారు. ఇదిలా ఉండగా అన్న నందమూరి తారకరామారావు జయంతి రోజైన మే 28వ తేదీ నుంచి.. తమ తండ్రి బి.వి.రామారావు పేరుతో స్థాపించిన బివిఆర్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని రామ్ తెలిపారు.

# ఉగ్రవాదంపై భారత్ ఉగ్రరూపం

**కీలకమైన ఉగ్రవాదులను హతమార్చిన భారత సైన్యం వీరత్వానికి సెల్యూట్**

**బిజెపి పార్టీ జిల్లా నాయకులు కొప్పుల యాదిరెడ్డి వర్కుడ్ పెల్లి గ్రామం**

**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మే 11.** మీడియాతో మాట్లాడుతూ భారత సైన్యాన్ని ఎదిరించే దమ్ము లేక సామాన్య ప్రజలపై పాక్ సైన్యం చేస్తున్న బాంబు దాడులు వారి నీచమైన బుద్ధికి నిదర్శనమని, జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది అమాయక టూరిస్టులు ప్రాణాలు కోల్పోతే..భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ పేరుతో..ఈనెల 7న పాకిస్తాన్ లోని ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసి..ఉగ్రవాద శిబిరాలను నిర్వీర్యం చేసినప్పటి నుండి..పాక్ సైన్యం కవ్వింపు చర్యలకు పాల్పడుతూ..ఎల్ఓసి వెంట కాల్పులు జరుపుతూ..భారత్ పైన డ్రోన్లతో, బాంబులతో అమాయక ప్రజలపై దాడులు చేస్తుంటే..పాక్ సైన్యాన్ని నిల్వరించి వీర మరణం పొందిన జవాన్లకు కన్నీటితో ఘన నివాళులర్పిస్తూ..వారి త్యాగానికి పాదాభివందనం చేస్తున్నామని బిజెపి పార్టీ జిల్లా నాయకులు కొప్పుల యాదిరెడ్డి ఆయన స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశం కోసం, ధర్మం కోసం శక్తి వంచన లేకుండా పోరాడుతూ..ఉగ్రవాదులకు, తీవ్రవాదులకు కాపు కాస్తున్న పాక్ సైన్యాన్ని చీల్చి చెండాడుతూ దూసుకుపోతున్న మన భారత సైన్యానికి మనమంతా అండగా నిలబడదామన్నారు. రోజు రోజుకు భయంతో భారత సైన్యం దాటికి ఉక్కిరి బిక్కిరి అవుతూ..ఊపిరి ఆడని దయనీయస్థితిలో పాకిస్తాన్ ఉందని, అయినప్పటికీ పశ్చాత్తాపం, తప్పు చేశామనే బాధ ఏమాత్రం వారిలో లేదన్నారు. ప్రపంచ పటంలో పాకిస్తాన్ లేకున్నా మంచిదే కానీ..ఉగ్రవాదం, తీవ్రవాదం లేకుండా వాళ్లు బ్రతకలేరని, మత ఉన్మాదంతో ప్రపంచ అశాంతికి కారణమవుతున్న పాకిస్తాన్ ను ప్రపంచ దేశాలు బహిష్కరించాలన్నారు. 140 కోట్ల మంది భారతీయులు ఒక్కసారి గట్టిగా జై భారత్ అంటే ఆ శబ్దానికే పాకిస్తాన్ నామరూపాలు లేకుండా పోతుందన్నారు. పాకిస్తాన్ కు అహం, బలుపు చైనా,టర్కీ దేశాలని..రేపు పాకిస్తాన్ ఉగ్రవాదులు మీపై కూడా దాడి చేస్తే మీకు అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని భారతదేశానికి క్షమాపణలు చెప్పి ఇకముందు భారత్ వైపు కన్నెత్తి చూడకుండా వంకర బుద్ధి మానుకొని ప్రశాంతంగా జీవించాలని, లేకపోతే ప్రపంచ పటంలో మీ దేశాలు కూడా ఉండవని..ఇది హిందూస్తాన్ హెచ్చరికగా చెప్తున్నామన్నారు.

# గాజువాక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో స్వచ్ఛ భారత్



**ఆరోగ్యంగా ఉండాలంటే స్వచ్ఛతను పాటించాలి సీఐ పార్థసారథి**

**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మే 11 :** గాజువాక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో సిఐ పార్థసారథి ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం జరిగింది. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బిజెపి నాయకులు కరణంరెడ్డి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు. చీపుర్లతో చెత్తను శుభ్రం చేసారు. ఈ సందర్భంగా సిఐ పార్థసారథి మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ప్రధాని మోదీ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారని అన్నారు. ఆరోగ్య భారత్ కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించాలని కోరారు. స్వచ్ఛతతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని అన్నారు. మన పరిసర ప్రాంతాలు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండాలని సూచించారు. వారికి సహకరించిన బిజెపి నాయకులకు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ఐ నజీర్, నాయకులు బాటా శ్రీను,గూటూరు శంకరరావు, బొండా. యల్లాజీరావు, రోహిణి, అనిత, తాతారావు, అప్పలరాజు, ములకలపల్లి ప్రకాష్, సిరసపల్లి అప్పారావు, శేఖర్, మనోహర్, నరసింహ, రవీంద్ర, కృష్ణారెడ్డి, రామానాయుడు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# స్వగ్రామానికి సేవ చేయటం సంతోషంగా ఉంది..

లక్ష్మీ కన్ స్ట్రక్షన్స్ అధినేత వట్టి కొండ శ్రీనివాసరావు..



**తల్లాడ మే 11 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్**

జన్మభూమికి, స్వగ్రామానికి సేవ చేయటం సంతోషంగా ఉందని లక్ష్మీ కన్ స్ట్రక్షన్స్ అధినేత, అన్నారుగూడెం గ్రామానికి చెందిన వట్టికొండ శ్రీనివాసరావు అన్నారు. హైదరాబాదులో ప్రముఖ కాంట్రాక్టర్ గా ఉంటున్న శ్రీనివాసరావు ఆదివారం అన్నారు గూడెం గ్రామంలో జరిగే యలమంచి వెంకటయ్య కుమారుని వివాహానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన స్వగ్రామం కావడంతో స్నేహితుని కుమారుని వివాహానికి హాజరైనట్లు తెలిపారు. గ్రామంలో సాయిబాబా దేవాలయానికి, అంకమ్మ మహాలక్ష్మమ్మ దేవాలయానికి లక్ష చొప్పున రెండు లక్షలు రూపాయలు అందించినట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో కూడా తన వంతు సహాయంగా గ్రామ ప్రజలకు అందిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురిని కలిసి ఆప్యాయంగా పలకరించారు.

## పంపాన వారి మాతృ దినోత్సవ వేడుకలు



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మే 11 :** పెదవాల్తేరు పంపాన వంశస్తులు,మీనా, లీనా ఆత్మీయ,అనుబంధం కలయికలో ఎంవీపీ కోలని లో ఉన్న ఆహా సమావేశం హాలులో మాతృమూర్తి దినోత్సం సందర్భంగా,మాతృమూర్తులకు, పాదభిశేకం అంగరంగ వైభవంగా,ఆనందంగా,సంతోషంగా జరిగినాయి. మాతృమూర్తుల దీవెనలతో, పిల్లల ఆటపాటలతో, మహిళల అంత్యాక్షరిలతో, సరదాగా, వినోదంగా, పసందైన విందుకార్యక్రమం జరిగినది, ఈ కార్యక్రమం లో పంపాన. మాత్నుమ్మర్తులు,శ్రీమతులు, ,సులోచన,లక్ష్మి, సావిత్రి, అనంత లక్ష్మి,చిన, లక్ష్మి, మరియు,ఆనంద్, ప్రసాద్, శివా, వెంకట్,కుమార్, రవితేజ, నగేష్, శ్రీధర్, కిషోర్, విజయ్, రాజేష్, నవీన్ ,సాయి గణేష్, పద్మ, జ్యోతీ,పద్మని, దివ్యా, సుధా,,రామకుమారి,మీనా, లీన, అరుణా, లీలా, సునీత,లావణ్య, రాధ, అశ్వనీ, సాయి,నూతన దంపతులు అవినాష్, చాందిని. పిల్లలతో పంపాన కుటుంబ సభ్యులు 50 మంది కి పైగా పాల్గొన్నారు.

# అంబెడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- భారత రత్నా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక వర్గానికి చెందిన వాడు కాదని అంబేద్కర్ అందరి వాడు ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**సీకే న్యూస్ మే 11 హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:**ధర్మసాగర్ మండలం కేశవనగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం అయిన భారత దేశం నేటికి ఐక్యంగా ఉంది అంటే, భిన్నత్వంలో ఏకత్వం కొనసాగుతుంది అంటే దానికి కారణం అంబేద్కర్ రాజ్యాంగం మాత్రమేనని వివరించారు. దేశంలోని అన్ని మతాలకు, కులాలకు, వర్గాలకు సమ ప్రాధాన్యత కల్పించారాని తెలిపారు. సమాజంలో అంటరాని తనాన్ని, కులవివక్షకు గురవుతున్న వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించిన మహనీయులు అంబేద్కర్ ని కొనియాడారు. ఆ రిజర్వేషన్ల ద్వారానే విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయాలలో ఎదగగలుగుతున్నామని తెలిపారు. సమ సమాజ స్థాపనకు కృషి చేసిన అంబేద్కర్ పీడీత వర్గాల ఆరాధ్య దైవమని అన్నారు. కేవలం చదువు తోనే మన జీవితాలలో మార్పు వస్తుందని, ఉన్నత చదువులు చదివి పోటీ ప్రపంచంలో నిలబడే విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు.

కేశవనగర్ చిన్న గ్రామం అయినా రాజకీయంగా నాకు అండగా నిలబడుతుందని అన్నారు. 25ఏళ్ల క్రితం తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే కేశవనగర్ గ్రామానికి రోడ్డు వచ్చిందని, ఇల్లు వచ్చాయని అన్నారు. మళ్ళీ ఇప్పుడు ఇందిరమ్మ రాజ్యంలోనే ఇల్లు వచ్చాయని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ అని ఉదరగొట్టి ఒక్క ఇల్లు ఇవ్వలేదని ఏద్దేవా చేశారు. పెద్దపెండ్యాల నుండి కేశవనగర్ బీటి రోడ్డు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహా కమిటీ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

CK NEWS చంద్ర కాంత్ తెలుగు దినపత్రిక

## జగనూ.. కేసీఆర్ తో పోటీ పెట్టుకుంటే ఎలా? ఆయన బలం ఏంటి నీ బలగం ఎక్కడ?

వైఎస్ జగన్ రాజకీయాలను ఇంకా సీరియస్ గా తీసుకోవడం లేదు. పొరుగు రాష్ట్రానికి చెందిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తో ఆయన పోటీ పడుతున్నారు. కేసీఆర్ కు కుమారుడు కేటీఆర్, కుమార్తె కవిత, అల్లుడు హరీశ్ రావులు ఉన్నారు. కానీ జగన్ కు దగ్గర వాళ్లు ఎవరూ లేరు. ఎవరూ అధికార పార్టీపై విరుచుకుపడే అవకాశం కనిపించడం లేదు. బంధువులందరూ దాదాపుగా దూరమయ్యారు. అదే సమయంలో నేతలు కూడా వరస అరెస్ట్ లతో బయటకు రావడానికి కూడా భయపడిపోతున్నారు. ఈ సమయంలో జగన్ తప్ప మరొకరు ఎవరూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడేందుకు అవకాశం లేదు. కానీ జగన్ నెలలో రెండు రోజులు ఏపీలో ఉంటే మిగిలిన రోజులు కర్ణాటకలో కాలం వెళ్లదీస్తున్నారు.

**కేసీఆర్ కు అండగా...**

కేసీఆర్ కు అంటే బలమైన నేతల మద్దతు ఉంది. ఆయన బయటకు వచ్చినా, ఫాం హౌస్ కు పరిమితమయినా పెద్దగా నష్టం వాటిల్లదు. ఎందుకంటే ప్రతి రోజూకేటీఆర్, హరీశ్ రావు, కవితలతో పాటు నేతలు కూడా బయటకు వచ్చి తెలంగాణలోని అధికార కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడుతున్నారు. అందువల్ల కేసీఆర్ ఫాం హౌస్ లో ఉన్నా, లేక బయటకు రాకపోయినా పెద్దగా రాజకీయంగా నష్టమేమీ ఉండదు. వారే పార్టీని ముందుండి నడిపిస్తున్నారు. కేసీఆర్ కేవలం డైరెక్షన్ ఇస్తే సరిపోతుంది. క్యాడర్ లో భరోసా నింపేందుకు వారు చాలు. అందుకే కేసీఆర్ దాదాపు రెండేళ్ల నుంచి బయటకు రాకుండా బిందాస్ గా ఉన్నప్పటికీ పార్టీని గాడితప్పనివ్వకుండా కంట్రోల్ చేయగలగుతున్నారు.

**అందరూ దూరం కావడంతో...**

కానీ జగన్ విషయంలో అది పూర్తిగా రివర్స్. తల్లి...చెల్లి దూరమయ్యారు. సతీమణి భారతి రాజకీయాలకు దూరంగా ఉంటారు. ఇక సన్నిహితులైన విజయసాయిరెడ్డి, బాలినేని శ్రీనివాసులు రెడ్డి లాంటి వాళ్లు పార్టీని వీడివెళ్లిపోయారు. ఇక లింగు లింగు మంటూమిగిలింది వైవీ సుబ్బారెడ్డి ఒక్కడే. ఇక పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తో పాటు సజ్జల రామకృష్ణారెడ్డి లాంటి వాళ్లు కూడా బయటకు వచ్చి విమర్శలు చేసే పరిస్థితి కనిపించడం లేదు. వాళ్లే పీకల్లోతు కష్టాల్లో చిక్కుకున్నారు. వారి సమస్యలు వారికి ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ క్యాడర్ కు భరోసా ఇచ్చేందుకు వచ్చే సాహసం ఎవరు చేయలేకపోతున్నారు. ఎక్కడకక్కడ నేతలు బయటకు రావాలన్నా కేసులు భయపెడుతున్నాయి.

**క్యాడర్ లో భరోసా నింపాలంటే...?**

ఈ నేపథ్యంలో జగన్ మాత్రమే బయటకు రావాల్సి ఉంది. జగన్ బయటకు వచ్చి క్యాడర్ తో మమేకం అయితే తప్ప పరిస్థితుల్లో మార్పు రాదని అంటున్నారు. అంతే తప్ప ఎప్పుడో వచ్చి తాను తిరిగి ఫ్యాన్ ను గిరాగిరా తిప్పేస్తానని భావిస్తుంటే అది అత్యాశే అవుతుంది. ఎందుకంటే అప్పటికే పార్టీ క్యాడర్ కకావికలం అయిపోతుంది. ఇప్పటికే చాలా నియోజకవర్గాల్లో కార్యకర్తలు నిరాసతతో ఉన్నారు. నిరాసక్తతతో తమ పని తాము చేసుకుని వెళుతున్నారు తప్ప పార్టీని గురించి పట్టించుకోవడం లేదు. తమకు కష్టమొచ్చినా ఆదుకుంటామని ధైర్యం చెప్పే నాధుడు లేకపోవడంతోనే క్యాడర్ లో ఒకరకమైన నిస్తేజం ఆవరించింది. మరి జగన్ ఇప్పటికైనా యాక్టివ్ అవుతారా? లేదా? అన్నది చూడాలి.

# యుక్తవయసులోనే రక్తపోటు, మధుమేహం సమస్యలు

## అనారోగ్యకర ఆహారం, జీవనశైలి దుష్ఫలితాలు

## కొలన్ లేదా రెక్టమ్ కేన్సర్ ముప్పు



వయసు మీద పడుతుంటే అనారోగ్య సమస్యలు పలకరిస్తుండడం సహజం. కాల క్రమేణా కణాల నష్టం కారణంగా ఇవి తలెత్తుతాయి. అంటే, యుక్త వయసులో ఉన్న వారికి వ్యాధుల ముప్పు ఉండదని కాదు. అనారోగ్యకర జీవనశైలి కారణంగా కొన్ని రకాల వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం యువతీ యువకులకు సైతం ఉంటుంది.

**రక్తపోటు**

రక్తపోటు ఆరోగ్యవంతులైన వారిలో 120/80 ఉండాలి. అయితే, దీనిని మించి అధిక రక్తపోటుకు గురైతే మాత్రం అది గుండె ఆరోగ్యాన్ని, మూత్రపిండాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. గుండె పోటు లేదా బ్రెయిన్ స్ట్రోక్ రిస్క్ ను ఎదుర్కోవాల్సి వస్తుంది. కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉంటే చిన్న వయసులోనే వారసుల్లో ఇవి కనిపించొచ్చు. ఇటీవలి కాలంలో మనం 40-50 ఏళ్ల మధ్యలో సెలబ్రిటీల మరణాలు చూస్తున్నాం. యువతీ యువకులు డ్యాన్స్ చేస్తూ కుప్పకూలిపోవడం కనిపిస్తోంది. గుండెకు సంబంధించి ఎక్కువ ముప్పు కలిగించే వాటిల్లో అధిక రక్తపోటు ఒకటి. అందుకే కనీసం మూడు లేదా ఐదు నెలలకు ఒకసారి బీపీ చెక్ చేయించుకోవాలి.

**టైప్ 2 మధుమేహం**

టైప్ 2 మధుమేహం రిస్క్ కూడా యువతీ యువకుల్లో పెరుగుతోంది. 14 నుంచి 25 ఏళ్ల వయసులోపు వారిలో ఈ కేసులు 20 శాతం పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. మధుమేహం బారిన పడిన వారు దీన్ని నియంత్రణలో పెట్టుకోకపోతే అది శరీరంలోని కీలక అవయవ వ్యవస్థను దెబ్బతీస్తుంది.

**ఆస్టియో పోరోసిస్**

చిన్న వయసులో ఎముకల సాంద్రత ఎక్కువగా ఉంటుంది. 35 ఏళ్లకు వచ్చిన తర్వాత ఎముకలు ఈ సాంద్రతను క్రమంగా కోల్పోతుంటాయి. ఆస్టియోపోరోసిస్ సమస్య బారిన పడిన వారిలో ఇది మరింత వేగంగా జరుగుతుంది. అంటే ఎముకలను బలహీన పరుస్తుంది. దీంతో ఫ్రాక్చర్ల ముప్పు పెరుగుతుంది. జారి పడిపోయినా, బ్యాలన్స్ తప్పినా ఫ్రాక్చర్ల బారిన పడుతుంటారు. సాధారణంగా 50 ఏళ్ల పైబడిన వారిలో ఈ రిస్క్ ఎక్కువ. కానీ నేటి జీవనశైలితో 30, 40 ఏళ్లల్లోనూ దీని బారిన పడుతున్నారు.

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, రోజువారీ వ్యాయామం చేస్తూ నిశ్చలమైన జీవనశైలికి దూరంగా ఉండాలి. ఉప్పు, చక్కెర వినియోగాన్ని తగ్గించాలి. పీచు పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మద్యపానం, సిగరెట్లకు స్వస్తి చెప్పాలి. ఏడాదికోసారి అయినా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.

**బవెల్ కేన్సర్**

**దీన్నే పేగు కేన్సర్ అని కూడా అంటారు. చిన్న పేగు, పెద్ద పేగు, పురీష నాళం (రెక్టమ్)లో ఎక్కడైనా ఇది రావచ్చు. దీనికి కచ్చితమైన కారణాలను ఇప్పటికీ గుర్తించలేదు. కాకపోతే అతిగా మద్యం సేవించే వారు, ఫైబర్ లేని ఆహారం తీసుకునే వారికి రిస్క్ ఎక్కువని పలు అధ్యయనాల్లో గుర్తించారు. ఎక్కువగా యుక్తవయసులో వారు దీని బారిన పడుతున్నారు. 1950ల్లో పుట్టిన వారితో పోలిస్తే 1990ల్లో పుట్టిన వారికి దీని రిస్క్ రెట్టింపు ఉంటుందట.**



**35 శాతం మందికి బీపీ**

**ఐసీఎంఆర్ నివేదిక వెల్లడి**

**కొంత మెరుగ్గా తెలుగు రాష్ట్రాల పరిస్థితి**

# దేశ జనాభాలో 11 శాతం మందికి మధుమేహం

దేశంలో మధుమేహ బాధితుల సంఖ్య వేగంగా పెరిగిపోతోందని, బీపీ బాధితులు కూడా ఎక్కువేనని ఇండియాస్ మెటబాలిక్ హెల్త్ రిపోర్ట్ (ఐసీఎంఆర్) వెల్లడించింది. జనాభాలో 11 శాతం మందికి మధుమేహం ఉందని పేర్కొంది. మరో 15 శాతం మంది ప్రీడయాబెటిక్ స్టేజిలో ఉన్నారని తెలిపింది. బీపీతో బాధపడుతున్న వారి సంఖ్య తక్కువేం కాదని, మొత్తంగా 35.5 శాతం మంది రక్తపోటు బాధితులేనని వెల్లడించింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన అధ్యయనంలో ఈ వివరాలు బయటపడ్డాయని తెలిపింది. ఈ పరిశోధనా పలితాలను లాన్సెట్ జర్నల్ కూడా ప్రచురించింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అసాంక్రమిక వ్యాధుల భారాన్ని అంచనా వేయడానికి ఈ అధ్యయనం చేపట్టినట్లు ఐసీఎంఆర్ శాస్త్రవేత్తలు తెలిపారు. ఇందులో భాగంగా 1,13,043 మంది నుంచి నమూనాలు సేకరించి, విశ్లేషించామని వివరించారు. ఈ నివేదిక ప్రకారం.. మధుమేహం, బీపీ బాధితుల విషయంలో తెలుగు రాష్ట్రాల పరిస్థితి కొంతవరకు మెరుగ్గానే ఉందని చెప్పారు. మధుమేహ బాధితులు ఎక్కువగా గోవా, పుదుచ్చేరి, కేరళ, చండీగఢ్, ఢిల్లీలలో ఉన్నారని, ఈ జాబితాలో తెలంగాణ 17వ స్థానంలో, ఆంధ్రప్రదేశ్ 19వ స్థానంలో నిలిచాయని తెలిపారు. తెలంగాణలో 9.9 శాతం, ఏపీలో 9.5 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నారని చెప్పారు.

# నయన్ దూకుడు తగ్గడానికి రీజన్ అతనేనా..?



కోలీవుడ్ లేడీ సూపర్ స్టార్ నయనతార ఈమధ్య కాస్త దూకుడు తగ్గించిందని చెప్పొచ్చు. బాలీవుడ్ లో జవాన్ సినిమా చేసి సూపర్ హిట్ అందుకున్న నయనతార కోలీవుడ్ లో వరుస సినిమాలు చేస్తుంది. ఐతే ఎందుకో అమ్మడు ఇదివరకు అంత దూకుడు చూపించలేక పోతుంది. అంతేకాదు స్టార్ సినిమా ఆఫర్లు కూడా చాలా తగ్గిపోయాయి. ఇదివరకు అక్కడ టాప్ స్టార్స్ ఒకరు కాకపోతే మరొకరు నయనతారతో సినిమాలు చేస్తుంటారు.

ఆమె డేట్స్ అడ్జస్ట్ కాకపోయినా సరే టైం ఇచ్చి మరీ ఆమెను తీసుకునే వారు. కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తే అలా లేదు. నయనతారకు అవకాశాలు రాకపోవడం వెనక రీజన్ ఆమె ధనుష్ తో పడిన గొడవే అన్న టాక్ ఉంది. నయనతార పెళ్లి డాక్యుమెంటరీ పై ధనుష్ కేసు వేయడంపై తిరిగి నయన్ కూడా అదే రేంజ్ లో ఎటాకింగ్ కి దిగింది.ఐతే ఇక్కడ తప్పు ఎవరిది అన్నది పక్కన పెడితే నయన్ ధనుష్ మధ్య ఉన్న దూరం ఆడియన్స్ కు తెలిసింది. ఈ క్రమంలో ధనుష్ వల్ల నయనతారకు అవకాశాలు రాకుండా అవుతున్నాయి. కారణం అతనా కాదా అన్నది పక్కన పెడితే ధనుష్ తో నయన్ గొడవ ఆమె కెరీర్ మీద ఎఫెక్ట్ పడేలా చేసిందని చెప్పొచ్చు. ధనుష్ తో నయనతార కూడా కలిసి నటించింది. వాళ్లిద్దరు కలిసి నటించినప్పుడు ఎలాంటి గొడవలు లేవు.ఎప్పుడైతే ధనుష్ నిర్మాణంలో చేసిన నాన్ రౌడీ ధాన్ సినిమా క్లిప్ ని తన డాక్యుమెంటరీలో వాడిందో అప్పటి నుంచి ఆమెకు ధనుష్ తో దూరం పెరిగింది. ఇద్దరు ఎదురుపడ్డా పలకరించుకోలేనంతగా పరిస్థితులు వచ్చాయి. ఇలా స్టార్ హీరో స్టార్ హీరోయిన్ ఫైట్ పరిశ్రమకు మంచిది కాదని తెలిసినా కూడా వాళ్లు దాన్ని కొనసాగిస్తున్నారు.ఇక ఇదే దారిలో నయనతారకు రావాల్సిన అవకాశాలు కూడా కొన్ని మిస్ అవుతున్నట్టు తెలుస్తున్నాయి. మరి నయనతార ధనుష్ మధ్య ఈ డిస్టన్స్ ని ఎవరు దగ్గర చేస్తారన్నది చూడాలి. ఎవరికి వారు తమ సినిమాలు చేస్తూ ఉన్నా కూడా నయనతార కెరీర్ లో స్పీడ్ తగ్గిందన్నది మాత్రం ప్రత్యక్షంగా కనిపిస్తుంది.




జినాల్ జోషి ఒక ఫ్రేమ్ కోసం చాలా గ్లామ్



ఆకాంక్ష సింగ్ ఒక ఫ్యాషన్ ట్రెండ్ సెట్టర్ కూడా అయిన బహుముఖ నటి

# చరణ్, తారక్, ప్రభాస్ లా మహేష్ శ్రమించలేదా?



బాహుబలి సమయంలో ప్రభాస్, రానాలు సినిమా ప్రారంభానికి ముందు ఎలా సన్నద్ధం అయ్యారో తెలిసిందే. ప్రభాస్ డ్యూయెల్ రోల్స్ పోషించాల్సి రావడంతో ఒక పాత్రకు బరువు పెరగడం..మరో పాత్రకు బరువు తగ్గడం జరిగింది. ప్రభాస్ బాడీలో ఈ మార్పు స్పష్టంగా కనిపించింది. అమరేంద్ర బాహుబలిలో కనిపిచండం కోసం భారీ దేహం... మహేంద్ర బాహుబలిలో కనిపించడం కోసం మరోలా శరీరంలో మార్పులు తీసుకురావాల్సి వచ్చింది. అందుకోసం ప్రభాస్ ఎంతో కష్టపడ్డాడు. ఒకకొన దశలో అనారోగ్యానికి గురయ్యాడు. భల్లాల దేవ పాత్ర కోసం రానా కూడా అంతే శ్రమించాల్సి వచ్చింది. భారీ దేహంతో కూడిన శరీరం కోసం తీసుకునే ఆహారంలో మార్పులు, కసరత్తులు చేసే సమయంలో మార్పులు ఇలా ఎన్నో చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత %-%ఆర్ ఆర్ ఆర్%-% సినిమా కోసం రామ్ చరణ్, ఎన్టీఆర్ కూడా అంతే శ్రమిం చారు. బ్రిటీష్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో చరణ్ భారీ దేహం...సిక్స్ ప్యాక్ లుక్ ఆ ట్రాన్స పర్మేషన్ చూసే స్టన్ అయ్యారంతా. ప్రభాస్ కష్టమంతా అందులో కనిపించింది. అలాగే ఎన్టీఆర్ కొమారం భీమ్ రోల్ కోసం అంతకు మించి శ్రమించాడు. బరువు మరింతగా తగ్గి సిక్స్ ప్యాక్ లంగోటా లుక్ చూడొచ్చు. అడవి బిడ్డగా తారక్ ఎంతో శ్రమించాడు.

రాజమౌళితో సినిమా అంటే హీరో ఇలా తయారవ్వాల్సి ఉంటుంది. మహేష్ రాజమౌళి సినిమా విషయం బయటకు వచ్చినప్పుడు ఎన్టీఆర్ చేస్తున్నావ్ గా? జక్కన్న తో! సినిమా అంటే ఎలా ఉంటుందోనని ఓ షోలో ఆటపట్టించాడు. మరి మహేష్ అలా రెడీ అయ్యాడా? మిల్క్ బోయ్ ని జక్కన్న అంతగా కష్టపెట్టాడా? అంటే అదెక్కడా కనిపించడం లేదు. లుక్ పరంగా మహేష్ బాడీలో ఎలాంటి కొత్త మార్పులు రాలేదు. %-%గుంటూరు కారం%-% టైమ్ లో ఉన్న వెయిట్ లోనే కొనసాగుతున్నారు. వచ్చిన మార్పు ఏదైనా ఉంది? అంటే అది కేవలం ఒక్క హెయిర్ స్టైల్లో మాత్రమే. అంతకు మించి ఒక్క ఛేంజ్ కూడా మహేష్ లో రాలేదు.

విదేశాల్లో...ఆఫ్రికన్ అడవుల్లో ట్రైనింగ్ తీసుకున్నాడని ప్రచారం జరిగింది. కానీ అలా ట్రైనింగ్ తీసు కుంటే శరీరంలో కొన్ని మార్పులు కనిపిస్తాయి. స్కిన్ టోన్ మారుతుంది. ముఖంలో మార్పులొస్తాయి. కానీ అవెక్కడా మహేష్ లో కనిపించలేదు. దీంతో రాజమౌళి మహేష్ని పెద్దగా కష్టపెట్టినట్లు ఎక్కడా కనిపిం చడం లేదనే టాపిక్ మొదలైంది. మేకోవర్ టార్గెట్ లేకుండానే మహేష్ బరిలోకి దిగడంటున్నారు.